ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత గురువారం గరిష్ఠం : 28.0 కనిష్ఠం : 22.0

ANDHRAJYOTHY



5 శ్రీసత్యసాయి జిల్లా వార్తలు

శుక్రవారం 19 సెప్టెంబరు 2025

ఆటో డ్రైవర్లకు పండుగ

- రూ.15వేల ఆర్థికసాయం ప్రకటించిన ప్రభుత్వం
- అక్టోబరు 2న బ్యాంకు ఖాతాల్లోకి సొమ్ము జమ
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆటో కార్మికులు



6

విదేశీ భక్తి పారవశ్యం

పుట్టపర్తి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సన్నిధిలో మలేషియా భక్తులు ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. సాయి కుల్వంత్ సభా మండపంలో రెండో రోజు గురువారం బికిల్ భరత్ బృందం గాన కచేరీ నిర్వహించింది. మలేషియా సంప్రదాయ సంగీతం, భక్తి గీతాలతో ఆకట్టుకున్నారు. అనంతరం సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు.



పాటలు పాడుతున్న మలేషియా భక్తులు

అధ్యక్షా..!





అసెంబ్లీ సమావేశాల్లో తొలిరోజే మంత్రి సత్యకుమార్ యాదవ్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి గళం వినిపించారు. వైద్య ఆరోగ్య శాఖలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి మంత్రి వివరించారు. ఉమ్మడి జిల్లాలో కీలకమైన ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ అంశాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి సభ దృష్టికి తీసుకెళ్లారు. ఏపీ, తెలంగాణలో ఆర్డీటీ అందిస్తున్న సేవలను వివరించారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఆ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏని రెన్యువల్ చేయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విన్నవించారు.

7



కోడూరు చెరువులోకి చేరుతున్న వర్షపు నీరు

చిలమత్తూరులో భారీ వర్షం

హిందూపురం, చిలమత్తూరు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): హిందూపురం నియోజకవర్గ వ్యాప్తంగా బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. చిలమత్తూరు మండలంలో అత్యధికంగా 8.72 సెం.మీ. వర్షపాతం నమోదైంది. లేపాక్షి మండలంలో 7.02, హిందూపురంలో 4.86, గోరంట్లలో 3.22, పరిగిలో 2.62 సెం.మీ. వర్షపాతం నమోదైంది. వర్షం బుధవారం సాయంత్రం నుంచి మొదలై గురువారం తెల్లవారుజాము వరకు ఏకధాటిగా కురిసింది. దీంతో వంకలు, వాగులు పొంగిపొర్లాయి. పొలాలు వర్షపు నీటితో నిండిపోయాయి. జిల్లాలోని పలు ప్రాంతాలలో గురువారం చిరుజల్లులు కురిశాయి.


ఓపికకు పరీక్ష వైద్య పరీక్షల కోసం గంటలు, రోజుల వెయిటింగ్ (7లో..)

జ్వరం జ్వరం..!

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు



ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు



- డెంగీ, మలేరియా బారిన జనం
- ఆస్పత్రులకు పరుగులు
- గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం
- మూలనపడిన ఫాగింగ్ మిషన్లు
- అవగాహన కార్యక్రమాలు పట్టని వైద్య ఆరోగ్య శాఖ

మురుగు కాలువలు నిండుకున్నాయి.. అపరిశుభ్రత తాండవిస్తోంది. దీంతో దోమలు విపరీతంగా వృద్ధి చెందుతున్నాయి. వాటి ద్వారా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. డెంగీ, మలేరియా బారిన పడి జనం విలవిల్లాడుతున్నారు. ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. అయినా.. అధికారుల్లో చలనం లేదు. పారిశుధ్య చర్యలు చేపట్టరు. దోమల నివారణకు ఫాగింగ్ కూడా చేయరు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించే నాథుడు కరువయ్యాడు.

ధర్మవరంరూరల్, సెప్టెంబరు18 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. గ్రామాల్లో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతుండడంతో దోమలు వృద్ధి చెంది, విషజ్వరాలతో ప్రజలు మంచాన పడుతున్నారు. ధర్మవరం పట్టణంతోపాటు మండలవ్యాప్తంగా గ్రామాల్లో పారిశుధ్యం లోపించింది. ఇటీవల కురిసిన వర్షాలకు డ్రైనేజీ కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండి దోమలకు ఆవాసంగా మారింది. పారిశుధ్య పనులు, మురుగునీటి కాలువలు శుభ్రంచేసే నాథుడే కరువయ్యాడు. తద్వారా దోమలు ఉత్పత్తి అవుతున్నాయి. వాటి ద్వారా విష జ్వరాలు ప్రబలుతున్నాయి. డెంగీ, మలేరియా వంటి విషజ్వరాల బారిన పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. జ్వర పీడితులు ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. పెద్దవారికి కీళ్లనొప్పులు, తలనొప్పి, వాంతులు, వీరేచనాలతో కూడిన జ్వరం సోకుతోంది. వైద్య, ఆరోగ్య శాఖ ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. డ్రైనేజీ కాలువలు నిండిపోయి, మురుగు నీరు ముందుకు కదిలే అవకాశం లేక రోడ్లపైకి వస్తోంది. ఎక్కడపడితే అక్కడ నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు పట్టించుకోవడం లేదని జనం వాపోతున్నారు. ఫాగింగ్, బ్లీచింగ్‌తోపాటు మిలాథిన్ ద్రావణాన్ని పిచికారీ చేసి, డ్రైనేజీ కాలువలను శుభ్రపరచాలని కోరుతున్నారు.

ఆస్పత్రులకు క్యూ..

జ్వర పీడితులు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ధర్మవరం ప్రభుత్వాస్పత్రిలో రోజూ 900 నుంచి 1000 మందిదాకా ఓపీలు తీసుకుంటున్నారని వైద్యాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆస్పత్రికి కీళ్లనొప్పులు, తలనొప్పి, జ్వర బాధితులే అధికంగా వస్తున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. రోజూ 80 మందిదాకా అడ్మిషన్ పొందుతున్నారన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో కూడా జ్వర పీడితుల ఓపీ పెరుగుతోంది.

పనిచేయని ఫాగింగ్ మిషన్లు

పంచాయతీలు, మున్సిపాలిటీల్లోని ఫాగింగ్ మిషన్లు పనిచేయక మూలన పడేశారు. ఒక్కరోజు కూడా ఫాగింగ్ చేయలేదని ప్రజలు వాపోతున్నారు. వేలకు వేలు ప్రజాధనం వెచ్చించారే తప్ప.. వాటిని వినియోగంలోకి తీసుకురావట్లేదు. వృథాగా మూలన పడేశారు.

ఓపీ పెరిగింది

ఆస్పత్రికి రెండువారాలుగా జ్వర పీడితుల ఓపీ పెరిగింది. వారికి రక్త పరీక్షలు చేసి, చికిత్స అందిస్తున్నాం. అవసరమైన అడ్మిట్ చేసుకుంటున్నాం.

- తిప్పేంద్రనాయక్, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్, ధర్మవరం

పారిశుధ్య చర్యలు చేపడుతున్నాం

సీజనల్ వ్యాధుల దృష్ట్యా గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే పలు గ్రామాల్లో డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయించాం. వీధుల్లో మిలాథిన్ ద్రావణాన్ని పిచికారీ చేయిస్తున్నాం. డ్రైనేజీ సమస్య, దోమలు అధికంగా ఉన్న పంచాయతీల అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం.

- సాయి మనోహర్, ఎంపీడీఓ, ధర్మవరం



అమరావతికి వెళ్లడానికి పీవీకేకే కళాశాలకు చేరుకున్న డీఎస్సీ విజేతలు, వారి కుటుంబ సభ్యులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..!

- చినుకుల్లోనూ అనంతకు డీఎస్సీలో ఎంపికైనవారు
- అధికారులతో కలిసి ఆనందంగా అల్పాహారం
- వర్షాలతో నియామక పత్రాల పంపిణీ సభ రద్దు
- అమరావతి పర్యటన వాయిదా
- కాబోయే గురువులకు నిరాశ



వాయిదా విషయాన్ని తెలియజేస్తున్న మాజీ మంత్రి పల్లె, డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం విద్య, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఉద్యోగార్థులకు కూటమి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. మెగా డీఎస్సీ-2025ని నిర్వహించింది. వేల మందికి టీచర్ ఉద్యోగాలు ఇచ్చింది. వారి జీవితాల్లో వెలుగులు నింపింది. ఉద్యోగం వచ్చిన ఆనందంలో ఉన్న వారికి నియామక పత్రాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అమరావతిలో అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో ఎంపికైన సంతోషపడ్డారు. ఆ క్షణం కోసం ఎదురుచూస్తున్నారు. గురువారం ఉదయం అనంతపురం నగర (మిగతా 6లో...)

పెద్దాస్పత్రిలో జూడాపై అత్యాచారయత్నం

- మూడురోజుల కిందట ఘటన

(వివరాలు మెయిన్‌లో)

మట్టించుకుందాం..!

- భూసార పరీక్షలతో ఎన్నో ప్రయోజనాలు



6

షెడ్డుకు అందని నిధులు



కొత్తచెరువు సమీపంలో నిర్మించుకున్న గోకులం షెడ్డు


- జిల్లాకు 1335 గోకులం షెడ్ల మంజూరు
- 909 నిర్మాణం పూర్తి
- బిల్లులు అందక రైతుల ఆందోళన
- రూ.5.25 కోట్ల కోసం అన్నదాతల ఎదురుచూపు

కొత్తచెరువు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్ల బిల్లులు అందక ఇబ్బంది పడుతున్నట్లు పలువురు పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. షెడ్ నిర్మాణం పూర్తయ్యి నెలలు గడిచినా బిల్లులు మంజూరు చేయకపోవడం దారుణమని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాడి రైతులను పరిశ్రమను ప్రోత్సహించేందుకు ఉపాధిహామీ పథకం కింద 90 శాతం రాయితీతో రైతులకు గోకులంషెడ్లను మంజూరు చేశారు. జిల్లాలోని 32 మండలా లకు 1335 గోకులంషెడ్లను మంజూరు చేశారు. జిల్లా వ్యాప్తంగా 909 మంది రైతులు ఈ షెడ్లను నిర్మించుకున్నారు. చాలామంది రైతులు మంజూరైన గోకులంషెడ్లను వదులుకోలేక అప్పు తెచ్చి షెడ్లను నిర్మించుకున్నారు. అయితే నేటికీ బిల్లులు మంజూరు కాకపోవడంతో వారు లబోదిబోమంటున్నారు. బిల్లుల కోసం పశువైద్యశాలలు, ఉపాధి కార్యాలయాల చుట్టూ తిరిగి అలసిపోయామని రైతులు వాపోతున్నారు. జిల్లాలో కొంత మంది మాత్రం అరకొర బిల్లులు పడ్డట్లు సమాచారం. రైతులకు మొత్తం రూ.5.25 కోట్లు మేరా బిల్లులు మంజూరు కావాల్సి ఉంది.

మూడు రకాలుగా గోకులం షెడ్లు

ప్రభుత్వం అర్హులైన రైతులకు 90 శాతం రాయితీతో మూడురకాల గోకులం షెడ్లను మంజూరు చేస్తోంది. పాడి పశువుల సంఖ్యను బట్టి గోకులం షెడ్ల నిర్మాణ యూనిట్లను పశువైద్యులు ఎంపిక చేస్తారు. రెండు పశువులు ఉంటే రూ.1.15 లక్షలు, నాలుగు పశువులు ఉంటే రూ.1.85 లక్షలు, ఆరు పశువులు ఉంటే రూ.2.30లుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో రైతువాటా 10 శాతం చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన 90 శాతం ప్రభుత్వం రాయితీగా ఇస్తుంది.

బిల్లులు పెట్టాం



జిల్లాలో పూర్తయిన గోకులం షెడ్లకు సంబంధించి బిల్లులు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేశాం. కొంత మంది రైతుల ఖాతాల్లోకి సబ్సిడీ డబ్బులు జమ అయ్యాయి. ఇంకా రూ.5.25 కోట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. వీటికి సంబంధించిన బడ్జెట్ విడుదల అయిన వెంటనే గోకులం షెడ్ల రైతుల ఖాతాల్లోకి డబ్బు జమ అవుతుంది. ఇంకా జిల్లాలో 426 మంది రైతులు షెడ్ల నిర్మాణం పూర్తిచేయాల్సి ఉంది. వారుకూడా త్వరగా షెడ్లను పూర్తి చేసుకుంటే బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తాం.

-విజయేంద్రప్రసాద్, డ్వామా పీడీ

జిల్లాలో 32 మండలాలకు మంజూరైన గోకులం షెడ్లు

మండలం	పంచాయతీలకు	గోకులంషెడ్ల	పూర్తయినవి	పూర్తికానివి
ధర్మవరం	20	20	12	8
గాండ్లపెంట	14	29	20	9
కదిరి	14	44	31	11
నల్లచెరువు	13	28	20	8
నంబుల పూలకుంట	14	38	30	8
తలుపుల	17	45	32	13
తనకల్లు	17	52	43	9
చిలమత్తూరు	12	98	52	46
హిందూపురం	14	41	35	6
లేపాక్షి	12	43	36	7
అగళి	13	41	25	16
అమరాపురం	11	51	34	17
గుడిబండ	16	24	20	4
మడకశిర	16	42	32	10
రొళ్ల	10	55	37	18
అమడగూరు	10	17	10	7
బుక్కపట్నం	13	22	19	3
కొత్తచెరువు	15	35	32	3
నల్లమాడ	14	34	23	11
ఓడీసీ	14	28	24	4
పుట్టపర్తి	15	48	43	5
గోరంట్ల	20	44	36	8
పరిగి	14	45	27	18
పెనుకొండ	11	37	35	2
రొద్దం	19	45	15	30
సోమందేపల్లి	16	41	27	14
చెన్నేకొత్తపల్లి	15	120	58	62
కనగానపల్లి	18	110	73	37
రామగిరి	9	58	28	30

ఇక.. స్మార్ట్‌గా..

- రేషన్ పంపిణీకి కొత్త విధానం
- స్మార్ట్ కార్డు స్వైప్ చేస్తేనే సరుకులు
- డీలర్లకు నూతన యంత్రాల పంపిణీ
- అక్రమాలకు చెక్ పెట్టేందుకు చర్యలు



ఈపోస్ యంత్రాన్ని డీలర్‌కు అందజేస్తున్న డీఎస్‌ఓ

హిందూపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో స్మార్ట్‌గా సరుకులు పొందవచ్చు. ఆ దిశగా పౌరసరఫరాల శాఖ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తోంది. ఇకపై స్మార్ట్ కార్డును స్వైప్ చేసి, సరుకులు పొందవచ్చు. తద్వారా అక్రమాలకు చెక్ పడనుంది. ప్రస్తుతం లబ్ధిదారుడికి అందజేస్తున్న స్మార్ట్‌కార్డును స్వైప్ చేస్తేనే సరుకులు అందేలా నూతన టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్ యంత్రాలను ఈపోస్ రేషన్ దుకాణాలకు పంపిణీ చేశారు. స్మార్ట్‌కార్డులు పూర్తిస్థాయిలో అందజేశాక కార్డుదారులు దానిని రేషన్ దుకాణం వద్దకు తీసుకెళ్లి స్కాన్ చేస్తేనే బియ్యం, ఇతర సరుకుల పంపిణీకి అవకాశం ఉంటుంది. గతంలోలా అవకతవకలకు పాల్పడే వీలుండదు.

ప్రయోజనం ఇదీ..

ఇప్పటి వరకు వినియోగిస్తున్న యంత్రాలతో వేలిముద్రల ఆధారంగా సరుకులు పంపిణీ చేసే వీలుండేది. వేలిముద్రలు పడనివారికి వీరే అధీకృత వ్యక్తుల వేలిముద్రలు (పీఆర్ఓ) తీసుకునే వారు. తద్వారా అక్రమాలకు పాల్పడేవారు. రేషన్ తీసుకోనివారి తరఫున వేలిముద్రలు వేసేసుకుని, సరుకులు కాజేశారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. కొత్త విధానంలో ఈ అక్రమాలకు చెక్ పడనుంది. స్మార్ట్ కార్డు ఉంటేనే సరుకులు పంపిణీ చేసే అవకాశం ఉంటుంది. కార్డును స్వైపింగ్ చేయగానే వివరాలు వస్తాయి. తర్వాత వేలిముద్ర వేసి, సరుకులు తీసుకోవచ్చు. వేలిముద్రలు పడని పక్షంలో ఐరిష్ ఆధారంగా పంపిణీ చేయవచ్చు. లబ్ధిదారుడు ఏయే సరుకులు తీసుకున్నాడో వివరాలు కూడా నమోదు చేసే వీలుంటుంది.

జిల్లాలో 5,67,118 రేషన్ కార్డులు

శ్రీసత్యసాయి జిల్లావ్యాప్తంగా 1,367 రేషన్ షాపులున్నాయి. వాటి పరిధిలో 5,67,118 రేషన్ కార్డులున్నాయి. పూర్తిస్థాయిలో స్మార్ట్‌కార్డులను అందజేయలేదు. జిల్లాలోని అన్ని మండలాలకు నూతన ఈపోస్ యంత్రాలు పంపిణీ చేశారు. అక్టోబరు, నవంబరు 1 నుంచి జిల్లావ్యాప్తంగా స్మార్ట్‌కార్డుల ద్వారా సరుకులు పంపిణీ చేసేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు.

డివిజన్‌లో శిక్షణ

శుక్రవారం నుంచి అన్నిచోట్లా యంత్రాలు అందుబాటులో ఉంచాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. దీంతో వీటి వినియోగంపై శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు పౌరసరఫరాలశాఖ ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే రీసోర్స్ పర్సన్ల ద్వారా ఆయా డివిజన్లలో శిక్షణ ఇస్తున్నారు. యంత్రాల వినియోగంపై సాంకేతిక నిపుణుల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

పారదర్శకంగా ఉంటుంది

నూతన ఈపోస్ యంత్రాలు, స్మార్ట్‌కార్డుల ద్వారా సరుకులు పంపిణీ చేయనున్నారు. తద్వారా పంపిణీలో పాదర్శకంగా ఉంటుంది.

- హారతి, సీఎస్‌డీటీ, హిందూపురం

మట్టించుకుందాం..!

● భూసార పరీక్షలతో ఎన్నో ప్రయోజనాలు ● వాటి ఫలితాల ఆధారంగా పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు ● తగ్గనున్న సాగు ఖర్చులు



కొత్తచెరువు మండలం బైరాపురం వద్ద మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు (ఫైల్)

కొత్తచెరువు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి) కొందరు రైతులు అధిక దిగుబడులు సాధించాలన్న ఉద్దేశంతో పరిమితికి మించి రసాయన ఎరువులు వాడుతున్నారు. పంటలకు అవసరం లేకున్నా ఎరువులు, పురుగు మందులు విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. దీంతో దిగుబడులు రాకపోగా.. వ్యవసాయ భూమి నిస్సారంగా మారుతోంది. చౌడు భూములుగా మారే అవకాశం లేకపోలేదని వ్యవసాయ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఈ సమస్యను అధిగమించాలంటే భూసార పరీక్షలు ఒక్కటే మార్గమని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. పంటలు పండాలంటే నేలలో ఖనిజ లవణాలు, పోషకాలు సమృద్ధిగా ఉండాలి. దీనిపై రైతులు దృష్టి పెట్టకుండా అధిక దిగుబడులు సాధించాలన్న ఆశతో కొందరు రసాయన ఎరువులను భారీగా వినియోగిస్తున్నారు. దీంతో భూమి సమతుల్యత దెబ్బతింటోంది. ఈ కారణంగా మొక్కకు సరైన పోషకాలు అందక పంట దిగుబడిపై ప్రభావం పడుతోందని శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు. తద్వారా పంటలు పండక రైతులు నష్టపోతున్నారు. ఈ సమస్యల నుంచి రైతులు బయటపడాలన్నా... అధిక దిగుబడులు సాధించాలన్నా మట్టి, నీటి నమూనా పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. మట్టి పరీక్షల ఫలితాల ప్రకారం పంటలు సాగుచేస్తే మేలైన దిగుబడులు సాధించవచ్చంటున్నారు. ఎరువుల వినియోగం తగ్గుతుందనీ, తద్వారా రైతుకు పెట్టుబడి ఖర్చు ఆదా అవుతుందన్నారు.

భూసార పరీక్షలే కీలకం

భూసార పరీక్షల ద్వారా భూమిలో ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియం ఇతర మూలకాలను గుర్తించవచ్చు. సూక్ష్మ పోషకాల లోపాలు కూడా తెలుస్తాయి. భూమిలో పోషకాల హెచ్చుతగ్గులను తెలుసుకోవచ్చు. మట్టి పరీక్షల వల్ల ఆమ్ల, క్షార లవణాల స్థాయి, సేంద్రియ కర్బనం, భాస్వరం, పొటాషియం ఎంత నిష్పత్తిలో ఉన్నాయో తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీంతో పంట వయసు కాలాన్ని బట్టి ఏ ఎరువులను ఎంత మోతాదులో వాడాలో తెలుస్తుంది. దీని ఆధారంగా నేలలో ఏ పంట వేస్తే అధిక దిగుబడి వస్తుందో తెసుసుకునే అవకాశం ఉంటుంది.

అధిక రసాయన ఎరువులతో నష్టాలు

పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలన్న ఉద్దేశంతో రైతులు మోతాదుకు మించి రసాయన ఎరువులు వినియోగిస్తున్నారు. అలా చేస్తే భూమిలోని పోషకాలు నశించిపోతాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయినా రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించడంలేదు. అధిక మోతాదులో పొటాషియం వాడడం వల్ల మెగ్నీషియం, జింక్, ఇనుము వంటి పోషకాలు మొక్కలకు అందకుండా పోతాయి. జింక్ లోపం కారణంగా మొక్క ఎదుగుదల తగ్గి, దిగుబడులపై ప్రభావం చూపుతుంది.సూక్ష్మ పోషకాలతోపాటు నైట్రోజన్, సేంద్రియ కర్బనాల స్థాయి చాలా కీలకం. సేంద్రియ కర్బనం లోపిస్తే భూమి సహజ స్వభావాన్ని కోల్పోతుంది. అపుడు భూమిలోకి ఎన్ని ఎరువులు వేసినా గ్రహించక నిస్సారమవుతుంది. ఈ కారణంగా పంటలు దెబ్బతినే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

అటకెక్కించిన వైసీపీ

తమది రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ పాలకులు... అన్నదాత సంక్షేమాన్ని అస్సలు పట్టించుకోలేదనడానికి భూసార పరీక్షలే నిదర్శనం. ఐదేళ్లు పూర్తిగా అటకెక్కించారు. దీంతో రైతులు.. ప్రైవేటుగా భూసార పరీక్షలు చేయింకోవాల్సి వచ్చిందని పలువురు రైతులు వాపోతున్నారు. కూటమి అధికారంలోకి రాగానే రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్లతోపాటు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేస్తూ.. భూసార పరీక్షలు నిర్వహిస్తోందని రైతులు వాపోతున్నారు.

శ్రీసత్యసాయి జిల్లాలో 2022 నుంచి 2025 వరకు చేసిన భూసార పరీక్షల వివరాలు..		
సంవత్సరం	సేకరించిన నమూనాలు	పంపిణీ చేసిన సాయిల్ కార్డులు
2022-23	00	00
2023-24	00	00
2024-25	17,200	17,200
2025-26	23,159	00

మట్టి సేకరించాలిలా..

● మట్టి పరీక్షలు చేయించుకునే రైతులు కొన్ని పద్ధతులు పాటించాల్సి ఉంటుందని శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు.

● పొలం అంతా ఒకే విధంగా ఉంటే రెండు,మూడెకరాల్లో 8 నుంచి 10 చోట్ల (ఇంగ్లిషు అక్షరం) టీ ఆకారంలో 6 నుంచి 7 అంగుళాల గుంత తీసి పై నుంచి కిందకు, అంచుల నుంచి మట్టిని సేకరించాల్సి ఉంటుంది.

● మట్టిలో పంట వేర్లు, ఆకులు లేకుండా చూసుకోవాలి.

● పండ్ల తోటలకైతే 3 నుంచి 4 అడుగుల వరకు గుంత తీసి అంచుల నుంచి ప్రతి అడుగుకు వేర్వేరుగా మట్టిని సేకరించాల్సి ఉంటుంది.

● మట్టి నమూనా సేకరించేటపుడు గట్ల వద్ద, నీరు నిల్వ ఉన్న చోట, రసాయన ఎరువులు వేసి ఉండుంటే 50 నుంచి 60 రోజుల వరకు మట్టిని సేకరించకుడదు.

● సేకరించిన మట్టి మొత్తాన్ని ఒక పట్టపై పోసి నాలుగు సమ భాగాలుగా చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఎదురెదురు భాగాలను తీసేయాలి. మిగిలిన మట్టిలో అర కిలో మట్టిని ప్లాస్టిక్ కవర్‌లో తీసుకుని, రైతు చిరునామా, ఫోన్ నంబర్, పంట వివరాలను రాసి పరీక్షా కేంద్రంలో అందజేయాల్సి ఉంటుంది.



దిగుబడి తగ్గుతోంది



నాకు మూడెకరాల పొలం ఉంది. గతేడాది అధికారులు పొలంలో భూసార పరీక్షల పేరుతో మట్టి తీసుకెళ్లారు. వాటిని పరీక్షించి, ఏ ఎరువులు ఎంత మోతాదులో వాడాలి, ఏ పంట సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయన్న విషయాలు తెలియజేయలేదు.దీంతో పంటలకు అధికంగా ఎరువులు వాడడం వల్ల ఖర్చు పెరుగుతోంది. పంటల దిగుబడి కూడా తగ్గుతోంది. ఇప్పటికైనా అధికారులు భూసార పరీక్షలు నిర్వహించి, సూచనలు ఇవ్వాలి.

-కోనప్ప, రైతు, కొత్తచెరువు

మట్టి పరీక్షల కోసం అనంతపురం వెళ్లాల్సి వస్తోంది



మామిడి, చీనీ పంటలు సాగుచేయాలనుకుంటున్నా. భూసార పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. ధర్మవరం, పెనుకొండలో ఉన్న కేంద్రాల్లో భూసార పరీక్షలు చేయలేదు. దీంతో అనంతపురం వెళ్లాల్సి వస్తోంది. గత ప్రభుత్వం వైఎస్ఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను కొత్తచెరువులో ఏర్పాటు చేసింది. ల్యాబ్ నిర్మించిందే తప్ప.. సేవలు మాత్రం అందుబాటులోకి రాలేదు.

- మధు, రైతు, కొత్తచెరువు

ఆటోడ్రైవర్లకు పండుగ



రూ.15వేల ఆర్థికసాయం ప్రకటించిన ప్రభుత్వం

అక్టోబరు 2న బ్యాంకు ఖాతాల్లోకి జమ

హర్షం వ్యక్తం చేస్తున్న ఆటో కార్మికులు





మార్కెట్‌లో పార్కింగ్ చేసిన ఆటోలు



ధర్మవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ ఆటో డ్రైవర్ల కుటుంబాల్లో నూతన సంతోషం నింపనుంది. అర్హులైన ఆటో డ్రైవర్ల బ్యాంకు ఖాతాలో అక్టోబరు 2న విజయదశమి రోజు రూ.15వేలు జమ చేయనున్నట్లు సీఎం చంద్రబాబు ఇదివరకే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇది జిల్లాలో వేల సంఖ్యలో ఉన్న ఆటో డ్రైవర్లకు ఎంతో భరోసాను కల్పించే విషయం. వీరికి దసరా కానుకగా రూ.15 వేలు అందనున్నాయి. వైసీపీ పాలనలో అనేక ఆంక్షలతో ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.10వేలు అందించారు. అయితే ఆటో కార్మికుల అకౌంట్లలో రూ.10వేలు జమచేసిన కొన్ని రోజులకే అప్పటి ప్రభుత్వం ఆర్టీఓలను రంగంలోకి దించి, చలానాలు, రవాణాశాఖ నిబంధనల పేరుతో రకరకాలుగా జరిమానాలు విధించి, చేసిన సాయం కంటే ఎక్కువగా లాగేశారని ఆటో డ్రైవర్లు గుర్తు చేసుకుంటున్నారు.

ఎవరికి వర్తిస్తుందంటే...

సొంత వాహనం కలిగి, దాన్ని నడిపే డ్రైవర్లకు ఈ పథకం వర్తిస్తుంది. జిల్లాలో ఆటో, క్యాబ్ డ్రైవర్లు ఏడువేల మంది ఉన్నారు. ఇటీవల వీరి సంఖ్య పెరిగి ఉంటుందని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో ఈసారి 10వేల మందికిపైగా సాయం అందే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం అందజేసే ఆర్థిక సాయం వాహన బీమా, టైర్ల మార్పులు, ఇంధన ఖర్చులు, కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతుందని ఆటో డ్రైవర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

హరిత పన్ను తగ్గింపు

ప్రజలను ఎడాపెడా పన్నులతో బాదేయడమే పనిగా పెట్టుకున్న గత వైసీపీ ప్రభుత్వం ఏటా వాహనదారుల నుంచి రూ.కోట్లలో పిండేసింది. హరితపన్ను పేరుతో రోడ్డెక్కిన ప్రతి వాహనం నుంచి డబ్బులు గుంజేసింది. వాహనం రిజిస్ట్రేషన్ చేసిన నాటి నుంచి ఏడేళ్లు దాటితే వాటి నుంచి హరిత పన్ను పేరుతో రూ.200 వరకు మాత్రమే కట్టించుకునేవారు. జగన్ ప్రభుత్వం మాత్రం 2022 జనవరి 1 నుంచి వివిధ స్లాబ్‌లుగా విడదీసి పన్నులు విధించింది. ఏడు నుంచి పదేళ్లయితే సగం త్రైమాసిక పన్ను విలువ, వాహనం వయస్సు 10 నుంచి 12 ఏళ్లు దాటితే రెండు త్రైమాసికాల పన్ను విలువ పెంచేసింది. వాహనాలపై భారీగా పన్నుల భారం పడింది. దీంతో వాహన దారులంతా ఆందోళన చేపట్టారు. ఎన్నికల సమయంలో హరిత పన్ను దోపిడీ గురించి తెలుసుకున్న చంద్రబాబు ఈ ఏడాది మేలో రవాణా, రవాణాయేతర వాహనాలపై హరిత పన్ను తగ్గిస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆటో కార్మికులపై భారీగా పన్ను భారం తగ్గింది.

ఆర్థిక భరోసా

ఆటో కార్మికులకు రూ.15వేల సాయం ఆర్థిక భరోసా కలిగించనుంది. వైసీపీ పాలనలో ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర పథకం ద్వారా రూ.10వేలు సాయాన్ని అందించారు. అయితే నిబంధనల పేరిట లబ్ధిదారులను సంఖ్య బాగా తగ్గించేశారు. రకరకాల జరిమానాలు విధించి ఆ చేత్తో ఇచ్చి ఈ చేత్తో లాగేసుకున్నారు

- డేరంగుల వీరనారప్ప, ఆటో డ్రైవర్, ముదిగుబ్బ

ఎంతో మేలు



ఆటో మిత్ర పథకం ప్రకటించిన సీఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో రోజు వారి ఆటోల్లో ప్రయాణించే వారి సంఖ్య 20 నుంచి 30శాతం తగ్గింది. .అయితే సీఎం చంద్రబాబు ఆటో డ్రైవర్లకు రూ.15వేలు ఇస్తామని ప్రకటించడం ఎంతో సంతోషం కలిగిస్తోంది. జరిమానాల జీఓ 21 రద్దు, సాధికారిత బోర్డు ఏర్పాటు, ఇంధన ధరలు తగ్గింపు వంటి ఎన్నికల హామీల అమలు చేస్తే మరింత మేలు కలుగుతుంది.

- వలి, ఆటో డ్రైవర్, కదిరిగేటు, ధర్మవరం

ఉపశమనం



ప్రస్తుతం ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేయడంతో ఆటోలకు ప్రయాణికుల సందడి తగ్గింది. దీంతో కంతులు కూడా కట్టుకోలేకపోతున్నాం. ఇంధన ధరలు పెరగడం, వాహన నిర్వహణ ఖర్చులు ఎక్కువ కావడం వల్ల చాలా మంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం రూ.15వేలు వాహనమిత్ర కింద ఇవ్వడం కొంత మేర ఉపశమనం కల్గిస్తోంది

- శీనప్ప, ఆటో డ్రైవర్, తలమర్ల, కొత్తచెరువు మండలం.

తాకిడి తగ్గింది



ఉచిత బస్సు ప్రయాణం లేనప్పుడు ఆటోలకు ప్రజలు ఎక్కువగా ప్రయాణించేవారు. ప్రస్తుతం ఉచిత బస్సు ప్రయాణంతో చాలా మంది మహిళలు ఆటోలు ఎక్కడం లేదు. దీంతో ప్రయాణికుల తాకిడి తగ్గింది. గతంలో రోజుకు రూ.1000 నుంచి రూ.1200వచ్చేది. ప్రస్తుతం రూ.600 నుంచి రూ.800 మాత్రమే వస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వం వాహన మిత్ర కింద రూ.15వేలు ఇస్తానని ప్రకటించడం సంతోషకరం.

- బషీర్, ఆటో డ్రైవర్, కొత్తచెరువు

సంతోషంగా ఉంది



గత వైసీపీ ప్రభుత్వంలో ఆటో డ్రైవర్లకు రూ.10వేలు ఇచ్చేవారు. ఆటో కార్మికుల అకౌంట్లలో రూ.10వేలు జమచేసిన కొన్ని రోజులకే అప్పటి ప్రభుత్వం ఆర్టీఓలను రంగంలోకి దించింది. చలానాలు, రవాణాశాఖ నిబంధనల పేరుతో రకరకాలుగా జరిమానాలు విధించింది. ఈ చేతితో ఇచ్చి ఆ చేతితో లాగేసుకుంది. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆటోడ్రైవర్ల కష్టాలను తెలుసుకుని రూ.15వేలు ఇస్తానని ప్రకటించడం ఎంతో సంతోషం కలిగిస్తోంది.

- కుళ్లాయప్ప, ఆటో డ్రైవర్, పుట్టపర్తి

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..!

(5వ పేజీ తరువాయి)

పరిధిలోని పీవీకేకే కళాశాల నుంచి బస్సుల్లో బయల్దేరాల్సి ఉంది. ఎంపికైన అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పీవీకేకే కళాశాలకు చేరుకున్నారు. వారికి జిల్లా విద్యాశాఖాధికారులు స్వయంగా అల్పాహారం వడ్డించారు. ఇక, బస్సు ఎక్కి బయల్దేరమే తరువాయి. ఇంతలోనే భారీ వర్షాలు వారి ఆశలపై నీళ్లు చల్లాయి. భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అమరావతిలో నియామక పత్రాల పంపిణీ సభను వాయిదా వేశారు. ఆ సమాచారాన్ని డీఈఓ ప్రసాద్ బాబు వెల్లడించడంతో ఎంపిక అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు నిరుత్సాహానికి లోనయ్యారు. బస్సుల్లో స్వగ్రామాలకు తిరుగు ప్రయాణమయ్యారు.

నాలుగు రోజులుగా కుస్తీ

డీఎస్సీ నియామకాల్లో భాగంగా అర్హత అభ్యర్థులను ఎంపిక చేసి, తుది జాబితాను విడుదల చేశారు. ఎంపికైన వారికి సీఎం నారా చంద్రబాబునాయుడు చేతులమీదుగా నియామక పత్రాలు అందించాలని నిర్ణయంతీసుకున్నారు. ఆ మేరకు 19న అమరావతిలో సచివాయలం సమీపాన ప్రత్యేక సభ ఏర్పాటు చేశారు. ఎంపికైన డీఎస్సీ అభ్యర్థులతోపాటు వారి తరఫున కుటుంబ సభ్యులు రావడానికి అవకాశం కల్పించారు. ఆ మేరకు బస్సులను ప్రభుత్వమే ఏర్పాటు చేయించింది. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యాశాఖ ఆధ్వర్యంలో వారం రోజులుగా ఏర్పాట్లు చేపట్టారు. మొత్తం 755 మంది డీఎస్సీ అభ్యర్థులతో పాటు టీజీటీ, పీజీటీ పోస్టులకు ఎంపికైన వారందరికీ కుటుంబం తరఫున మరొకరికి అమరావతికి రావడానికి వీలు కల్పించారు. మొత్తం 45 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులను నియమించారు.

ఆనందంగా వస్తే..

డీఎస్సీ ఎంపిక జాబితాలోని అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు విద్యాశాఖ సూచన మేరకు గురువారం ఉదయం 6 గంటలకే ఉరుకులు, పరుగులతో జిల్లాకేంద్రంలోని పీవీకేకే కళాశాల వద్దకు చేరుకున్నారు. అమరావతికి వెళ్లడానికి ఏర్పాటు చేసిన బస్సులు అక్కడకు చేరుకున్నాయి. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అందరికీ అల్పాహారం ఏర్పాటు చేయించారు. విద్యాశాఖాధికారులు.. అభ్యర్థులు, వారి కుటుంసభ్యులతో మాట్లాడుతూ.. డీఈఓ ప్రసాద్ బాబు, డిప్యూటీ డీఈఓలు మల్లారెడ్డి, శ్రీనివాసులు, ఏడీలు శ్రీనివాసులు, మునీర్ తదితరులు అల్పాహారం వడ్డించారు. ఇలా ఆనందంగా అమరావతికి వెళ్లి టీచర్ నియామక పత్రాలు అందుకోవాలని అభ్యర్థులు, ఆ ఆనంద క్షణాలను ఆస్వాదించాలని కుటుంబసభ్యులు ఆశగా ఉన్నారు. వారి ఆశలపై వరుణ దేవుడు నీళ్లు చల్లాడు. తెల్లవారుజాము నుంచి వర్షాలు పడుతుండడం, మరో రెండురోజులు భారీ వానలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అమరావతి సభను వాయిదా వేశారు. రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆ మేరకు ఉత్తర్వులు రావడంతో డీఈఓ.. అభ్యర్థులకు విషయం తెలిపారు. దీంతో అభ్యర్థులు నిరాశకు లోనయ్యారు. త్వరలో తేదీలు ప్రకటిస్తామన్నారు. దీంతో ఎంపిక అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు.. బస్సుల్లో సొంత ఊళ్లకు వెనుదిరిగారు.



కాబోయే గురువులకు అల్పాహారం వడ్డిస్తున్న విద్యాశాఖ అధికారులు

తొలగిన ఇబ్బందులు

● సరుకుల కొనుగోలులో సైనికుల కష్టాలకు చెక్
● విశాలవంతమైన భవంతిలోకి ఆర్మీ క్యాంటిన్
● భారీగా స్టాకు, కోరిన వస్తువులు అందుబాటులోకి
● పక్క జిల్లాల నుంచి సైతం వస్తున్న సైనిక కుటుంబాలు
● లక్షల నుంచి రూ.కోటి దాటిన క్యాంటిన్ ఆదాయం



గంగానగర్‌లో ఆర్మీ క్యాంటిన్ నిర్వహించిన చిన్నపాటి భవంతి (ఫైల్)

అనంతపురం ప్రెస్‌క్లబ్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకుల కొనుగోలులో సైనికులు, మాజీ సైనికుల కుటుంబీకుల ఇబ్బందులకు తెరపడింది. నగరంలోని గంగానగర్‌లో ఉన్న ఆర్మీ క్యాంటిన్ భవనం చిన్నది కావడంతో ఇన్నాళ్లు గంటల తరబడి క్యూలో నిలబడినా తమకు నచ్చిన వస్తువులు కొనుగోలు చేయలేక ఉసూరుమంటూ వెనుదిరిగేవారు. ప్రస్తుతం ఆ కష్టాలకు చెక్ పడింది. నగర శివారులోని ఆర్డీటీ స్టేడియం ఎదురుగా సువిశాలమైన భవంతిలో ఆర్మీ క్యాంటిన్ ఏర్పాటు చేశారు. అలాగే క్యాంటిన్‌కు వచ్చిన సైనికులు, మాజీ సైనికులు, వారి కుటుంబసభ్యులకు ఇబ్బందులు కలగకుండా సీటింగ్, పార్కింగ్ వసతులను ఏర్పాటు చేశారు.

ఒకేసారి రెండు నెలల గ్రోసరీ, లిక్కర్...

గతంలో గంగానగర్‌లో ఉన్న చిన్నపాటి భవంతిలో సరుకులు, లిక్కర్‌ను ఏర్పాటు చేసుకునే వెసులుబాటు లేకపోవడంతో స్టాకు తక్కువగా ఉండేది. అప్పట్లో నెలంతా కలిపినా 950 మందికి మాత్రమే కొనుగోలు చేసే అవకాశం ఉండేది. దీంతో చాలా సైనిక కుటుంబాలకు మద్యం, సరుకులు లభించేవి కావు. పెద్ద పెద్ద ఎలక్ట్రానిక్ వస్తువులు(ల్యాడర్, చిమ్నీలు, వాటర్ ఫిల్టర్, మిక్సీలు తదితర) నిల్వ చేసుకునే వీలు లేకపోవడంతో పరిమితికి లోబడి తెప్పించేవారు. ఈ నేపథ్యంలో చాలామంది బెంగళూరు, బళ్లారి వంటి ఆర్మీ క్యాంటిన్లకు వెళ్ల తమకు నచ్చిన వస్తువులు తెచ్చుకునేవారు. క్యాంటిన్ ఆదాయం కూడా అప్పట్లో రూ.42 లక్షలు నుంచి రూ.50 లక్షలలోపే ఉండేది. ప్రస్తుతం మూడు ఫ్లోర్లలో భవంతి ఉండటంతో ఒక ఫ్లోర్‌లో ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు సరుకులు, మరో ఫ్లోర్‌లో తినుబండారాలు, మరో ఫ్లోర్‌లో లిక్కర్ భారీ స్థాయిలో ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉంది. ప్రస్తుతం రోజుకు 2 వేల మందికిపైగా సైనికులు క్యాంటిన్‌లో సేవలు వినియోగించుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఒక కార్డుదారుడికి రెండునెలల సరుకులు తీసుకునే వెసులుబాటు కల్పించడం ఆయా వర్గాల్లో ఆనందం నింపుతోంది. కొత్త భవనంలో క్యాంటిన్ ఏర్పా టు చేసిన తర్వాత నెల ఆదాయం రూ.కోటికిపైగా పెరిగినట్లు అధికారులు తెలిపారు. డీమార్ట్ తరహాలో క్యాంటిన్ ఉండటంతో కడప, పులివెందుల, వేంపల్లి, కర్నూలు, డోన్, వెల్దుర్తి, నంద్యాల ప్రాంతాల మాజీ సైనికులు, సైనికులు ఇక్కడికి వచ్చి సరుకులు కొనుగోలు చేస్తున్నారు.



క్యాంటిన్‌లో ఏర్పాటు చేసిన నిత్యావసర సరుకులు

అక్రమాలకు చెక్

గంగానగర్‌లో క్యాంటిన్ చిన్నది కావడం, సరైన స్టాకు తెప్పించకపోవడంతో ఇబ్బందులు పడేవారు. అప్పట్లో కొందరు అధికారులు కొందరు మాజీ సైనికులకు సహకారం అందించడంతో సరుకులు, మద్యం పక్కదారి పట్టాయనే ఆరోపణలు వినిపించాయి. ఒక్కో మాజీ సైనికుడు నాలుగైదు కార్డులను తీసుకొచ్చి భారీ స్థాయిలో లిక్కర్ కొనుగోలు చేసి బయటి మార్కెట్లో అధిక ధరలకు అమ్ముకున్నారన్న విమర్శలు వినిపించాయి. కొత్త క్యాంటిన్‌లో సరుకులు కొనాలంటే ఎవరి కార్డు వారే తీసుకురావాలనే నిబంధనను మేనేజర్ మారుతీప్రసాద్ విధించారు. దీంతో గతంలోలా అక్రమాలకు పాల్పడే అవకాశం లేకుండాపోయింది.



ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఏర్పాటు చేసిన ఆర్మీ క్యాంటిన్

సక్రమంగా సర్వీస్



సబ్ ఏరియా అధికారుల సహకారంతోనే ఆర్డీటీ స్టేడియం వద్ద ఆర్మీ క్యాంటిన్ ఏర్పాటైంది. గంగానగర్‌లో ఉన్న క్యాంటిన్‌లో రోజుకు 80 నుంచి 90 మంది సైనికులకు మాత్రమే సర్వీస్ చేసేవాళ్లం. ప్రస్తుత క్యాంటిన్‌లో రోజుకు 300 నుంచి 400 మందికి సర్వీస్ ఇవ్వగలుగుతున్నాం. పాత క్యాంటిన్‌లో కొందరు మాజీ సైనికులు నాలుగైదు కార్డులు తీసుకొచ్చి భారీస్థాయిలో లిక్కర్‌ను కొనుగోలు చేసేవారు. దీంతో చాలా మంది సైనికులు లిక్కర్, గ్రోసరీ అందక ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం క్యాంటిన్‌లో అలాంటి వాటికి చెక్ పెట్టాం. ఒక్క సైనికుడు ఒక్క కార్డుతోనే వస్తున్నారు. అందరికి సకాలంలో సేవలు అందడంతో పాటు.. ఒక్కొక్కరికి రెండు నెలలకు సంబంధించి గ్రోసరీ, లిక్కర్ తీసుకునే వెసులుబాటు కల్పించాం. దీంతో క్యాంటిన్ ఆదాయంతో పెరగడంతో పాటు పక్కజిల్లాల సైనికులకు సైతం సేవలందించగలుగుతున్నాం.

- మారుతీప్రసాద్, మేనేజర్, ఆర్మీ క్యాంటిన్, అనంతపురం జిల్లా

ప్రజారోగ్యానికి పెద్దపీట: సత్యకుమార్


అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ గురువారం అసెంబ్లీలో వెల్లడించారు. వైద్యఆరోగ్యశాఖపై జరిగిన చర్చలో మంత్రి పలు విషయాలు శాసనసభ దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 100కు పైగా పీహెచ్‌సీలు మంజూరు చేశామన్నారు. 2021-22లో వీటి నిర్మాణాలకు జీఓలు, పాలనాపరమైన అనుమతులు మంజూరు చేశారే కానీ నిధులు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం వివిధ రాష్ట్ర, కేంద్ర పథకాల ద్వారా వీటి నిర్మాణానికి రూ.194 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. 46 పీహెచ్‌సీలను ఆర్‌అండ్‌బీ, 56 పీహెచ్‌సీలను ఏపీఎంఐడీసీ కింద నిర్మిస్తామన్నారు. పీహెచ్‌సీలలో చాలా ఖాళీలను భర్తీ చేశామని, ఇంకా కొన్ని చేయాల్సి ఉందన్నారు. వైద్యశాఖలో వివిధ విభాగాల్లో 2600 ఉద్యోగ నియామకాలు పూర్తి చేశామన్నారు. 62 ల్యాబ్ టెస్టులు, 172 రకాల మందులను ఆస్పత్రులకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. మందులు, ఇతరత్ర సర్జికల్స్‌కు ఏటా ఒక్కొ పీహెచ్‌సీలో రూ.11,71,560 ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఆర్డీటీ కోసం చొరవ చూపండి: సింధూర


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏని పునరుద్ధరించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ చూపాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అసెంబ్లీ వేదికగా కోరారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా తొలిరోజు గురువారం ఆమె ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్డీటీ పేదల పాలిట కల్పవృక్షంగా వెలుగొందుతోందన్నారు. కులమతాల కు అతీతంగా పేదల సంక్షేమానికి పని చేస్తోంద న్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లోని 3891 గ్రామాల్లో సుమారు 4.5లక్షల కుటుంబాలకు వివిధ సేవలందిస్తోందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఇళ్లు, వ్యవసాయ పరికరాలు ఉచితంగా అందజేస్తోందని తెలిపారు. భూగర్భ జలాల పెంపునకు చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంల నిర్మాణాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆర్డీటీ ఆస్పత్రుల ద్వారా లక్షల మందికి ఉచిత వైద్య సౌకర్యాలు అందించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత యువతకు క్రీడారంగంలో ఉచిత శిక్షణ ఇస్తూ, వారిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేలా కృషి చేస్తోందన్నారు. గ్రామీణ పేదల అభివృద్ధి కోసం శ్రమిస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించేలా కేంద్రాన్ని ఒప్పించాలని ముఖ్యమంత్రికి విన్నవించారు.

ఆర్డీటీ పరిరక్షణకు ప్రజా ఉద్యమం: అనంత


మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ పరిరక్షణ కోసం ప్రజా ఉద్యమం చేపడతామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టం చేశారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రిలో ఏటా రూ.8.5లక్షల మందికి వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఆర్డీటీకి మతం బూచి చూపి దేశం నుంచి వెళ్లిపోయేలా చేస్తున్నారన్నారు. విదేశీ నిధులు రాకుండా అడ్డుకుని ఆర్డీటీ సేవలు అందించలేని స్థితికి తెస్తున్నారని మండిపడ్డారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ కోసం ప్రజా, దళిత సంఘాలు, రాజకీయ పార్టీలు ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. సీఎం చంద్రబాబుకు సొంత ప్రయోజనాలు తప్పితే ఆర్డీటీ విషయం పట్టడం లేదా అని ప్రశ్నించారు. అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలన్నారు. ప్రభుత్వాలు దిగిరాకపోతే అందరినీ కలుపుకుని ప్రజా ఉద్యమం నిర్మించి ప్రభుత్వ మెడలు వంచుతామన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గమైందన్నారు. తాడిపత్రిలో మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు.

చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.16 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు.

మద్యం మత్తులో గొడవ.. హత్య

ఇంటిని అమ్మేందుకు యత్నం.. హతమార్చిన భార్య, కుమారుడు


బెస్త సుధాకర్(ఫైల్)

పామిడి, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఇంటిని విక్రయించేందుకు యత్నిస్తున్న బెస్త సుధాకర్(45)ను అతడి భార్య, మైనర్ కుమారుడు హతమార్చిన ఘటన బుధవారం పామిడిలో జరిగింది. పోలీసుల తెలిపిన మేరకు.. పట్టణంలోని బెస్తవీధిలో నివాసం ఉంటున్న లారీ డ్రైవర్ బెస్త సుధాకర్(45)కు ఉరవకొండకు చెందిన మీనాక్షితో 20 ఏళ్ల కిందట వివాహం జరిగింది. ఇటీవల సుధాకర్ మద్యానికి బానిసై, ఇంటిని విక్రయించేందుకు యత్నించాడు. దీనిపై భార్య మీనాక్షితో తరచూ గొడవలు జరిగేవి. ఈనేపథ్యంలోనే బుధవారం రాత్రి మద్యం సేవించిన సుధాకర్ తన భార్య మీనాక్షి, మైనర్ కుమారుడితో వాగ్వాదానికి దిగాడు. గొడవ పెద్దదై ఘర్షణకు దారితీసింది. ఆవేశంతో భార్య మీనాక్షి, కుమారుడు రోకలిబండతో సుధాకర్ తలపై కొట్టారు. తీవ్ర రక్తస్రావం కావడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడితోపాటు ఓ కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి బెస్త నడిపి సుంకన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ఓపికకు పరీక్ష

- వైద్య పరీక్షల కోసం గంటలు, రోజుల వెయిటింగ్
- అల్ట్రా సౌండ్, ఎంఆర్ఐ, సీటీ స్కానింగ్‌లకు క్యూ
- స్కానింగ్‌కు తేదీలు నిర్ణయిస్తున్న వైద్య సిబ్బంది
- తిరగలేకపోతున్నామంటున్న బాధితులు
- జిల్లా సర్వజనాస్పత్రిని వేధిస్తున్న యంత్రాలు, సిబ్బంది కొరత

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చే రోగులు వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే గంటలు కాదు రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. స్కానింగ్ కేంద్రాలకు బాధితులు అధిక సంఖ్యలో వస్తుండటంతో ఫలానా రోజు రావాలని తేదీలను నిర్ణయిస్తున్నారు. దీంతో జబ్బుతో ఇబ్బంది పడుతూ, వైద్య పరీక్షలు చేయించుకోవడానికి తమ వంతు ఎప్పుడు వస్తుందా అని బాధితులు ఎదురుచూస్తున్నారు.

ముగ్గురే దిక్కు

పెద్దాస్పత్రిలోని రేడియాలజీ విభాగంలో ఒక ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు మాత్రమే ఉన్నారు. ఇందులో ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి వేశారు. నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) నిబంధనల మేరకు.. రేడియాలజీ విభాగంలో ఇద్దరు ప్రొఫెసర్లు, ముగ్గురు అసోసియేట్ ప్రొఫెసర్లు, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, నలుగురు ఎస్ఆర్‌లు ఉండాలి. మొత్తం 13మందికి గాను ప్రస్తుతం ముగ్గురు మాత్రమే ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి.

ఆరు అల్ట్రాసౌండ్, ఒకటి చొప్పున సీటీ, ఎంఆర్ఐ

నిత్యం వందలాది మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఆరు అల్ట్రా సౌండ్, ఒక సీటీ స్కానింగ్, ఒక ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రాలున్నాయి. ఒకరికి అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయాలంటే కనీసం 10నుంచి 15 నిమిషాలు పడుతుంది. అదే సీటీ స్కానింగ్‌కు 20నుంచి 30నిమిషాలు, ఎంఆర్ఐ స్కానింగ్‌కు 30నుంచి 45నిమిషాల సమయం పడుతుంది. ఈ లెక్కన ఆస్పత్రిలో ఉన్న యంత్ర పరికరాలు, వైద్య సిబ్బందితో రోజు వందల సంఖ్యలో వచ్చే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించడం కష్టంగా మారింది. అయినా నిత్యం 200మందికిపైగా రోగులకు స్కానింగ్ చేస్తున్నామని రేడియాలజీ విభాగం వర్గాలు పేర్కొంటున్నారు.



ఎంఆర్ఐ స్కానింగ్ సెంటర్ల వద్ద పడిగాపులు

ఓవర్‌లోడ్ అవుతోంది



రేడియాలజీ డిపార్ట్‌మెంట్‌పై ఓవర్‌లోడ్ పడుతోంది. రోజులో 200 నుంచి 400మంది వరకు రోగులను పరీక్షిస్తున్నారు. అయినా తాకిడి తగ్గటంలేదు. అందరికీ స్కానింగ్‌లు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తాం. తగిన సంఖ్యలో సిబ్బంది లేకపోవడం సమస్యకు దారితీస్తోంది. సూపరింటెండెంట్‌గా నేను కొత్తగా బాధ్యతలు చేపట్టా. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తా.

-డాక్టర్ సుబ్రహ్మణ్యం, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల.

తిరగలేకపోతున్నాం..



గైనిక్ ప్రాబ్లమ్‌తో పెద్దాస్పత్రిలోని ఓపీ నెంబర్ 6లో చూపించుకున్నా. పరీక్షించిన డాక్టర్లు రక్త పరీక్షలు, స్కానింగ్‌లు రాశారు. రక్త పరీక్షల కోసం ల్యాబ్‌లో రక్తాన్ని సేకరించి, ఆ సిరంజిని నాచేతుల్లోనే పెట్టారు. అక్కడ, ఇక్కడ ఇవ్వాలని చివరికి ఎవరూ రక్తాన్ని తీసుకోలేదు. రక్తాన్నిసేకరించిన సిరంజ్‌ను రెండు రోజులుగా నా బ్యాగులో వేసుకుని తిరుగుతున్నా. అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రంలోనూ అదే పరిస్థితి. నిరీక్షించలేక కింద పడిపోవాల్సి వస్తోంది.

- మనీష, సిద్ధరాంపురం, బుక్కపట్నం మండలం.


అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రం వద్ద బాధితుల క్యూ

ప్రాణాలు పోయేట్లున్నాయి



పెద్దాస్పత్రిలో స్కానింగ్ చేయించుకునేలోపు ఉన్న ప్రాణాలు పోయేట్లున్నాయి. మా అమ్మ నారాయణమ్మకు బాగలేకపోవడంతో డాక్టర్లకు చూపించాం. అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించుకు రావాలని చెప్పారు. ఇక్కడ ఇసుకవేస్తే రాలనంత జనం ఉన్నారు. మావంతు వచ్చేలోపు ప్రాణాలు ఉంటాయో, పోతాయో..!

- జ్యోతి, కొత్తచెరువు.

కడుపునొప్పి ఎక్కువ అవుతోంది



కడుపునొప్పితో పెద్దాసుపత్రికి వచ్చా. పరీక్షలు, స్కానింగ్ లేనిదే డాక్టర్లు మందులు రాయడంలేదు. స్కానింగ్ కేంద్రంలో రేపు, మాపు అంటూ తేదీలు ఇస్తున్నారు. వందలాదిమంది బాధితులు స్కానింగ్ కేంద్రం వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. కడుపునొప్పి ఎక్కువ అవుతున్నా భరించాల్సి వస్తోంది.

- దివ్య, అనంతపురం.

సీటీ స్కానింగ్‌కు రెండు రోజులు



మానాన్న వన్నూరప్పకు బాగలేకపోతే పెద్దాస్పత్రిలో అడ్మిట్ చేశాం. వారం రోజులు తరువాత డిశ్చార్జ్ చేసి పొమ్మన్నారు. జబ్బు తగ్గకపోవడంతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి వెళ్తే సీటీ స్కానింగ్ రాసిచ్చారు. అక్కడినుంచి రావాలంటే సమస్య తప్పదు. స్కానింగ్ కేంద్రంలో ఎక్కువమంది ఉండటంతో రెండు రోజులు పట్టింది.

- మారెన్న, ఉడేగోళం.

రాహుల్ పోరాటానికి మద్దతుగా నిలవాలి

- డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి


సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఉరవకొండ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా అవకతవకలపై లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటానికి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి కోరారు. ఓట్ చోర్ గద్దె ఛోడ్ అనే నినాదంతో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఉద్యమంలో భాగంగా పట్టణంలోని క్లాక్‌టవర్ కూడలిలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే నెల 15 వరకూ ఈ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇస్తూ, ప్రజల ఓట్లను దోచుకుని మూడోసారి గద్దెనెక్కిందన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించే ప్రతిపక్షాలపైన సీబీఐ, ఈడీలతో దాడి చేయిస్తూ, బ్లాక్ మెయిల్ రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. పలురాష్ట్రాల ఎన్నికల్లో ఈవీఎంలలో స్కాం జరిగిందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్బాస్, శ్రీన, బ్యాళ్ల ప్రసాద్, నబీరసూల్, యోగానంద రెడ్డి, సుధాకర్, ఆలం నవాజ్, బొజ్జప్ప పాల్గొన్నారు.

పిల్లల సంరక్షణ.. అన్నిశాఖల బాధ్యత

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజశేఖర్


సమావేశంలో మాట్లాడుతున్న రాజశేఖర్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పిల్లలపై ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో జరిగే లైంగిక దాడి, వేధింపుల నుంచి సంరక్షించడం అన్నిశాఖల బాధ్యత అని, జిల్లాన్యాయసేవ అధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. జిల్లా న్యాయసేవాసదన్ హాల్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన పలుశాఖల అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో పిల్లలపై జరిగే లైంగిక దాడి, వేధింపులు, వాటి నుంచి పిల్లలను కాపాడే చట్టాలు, పాలసీలు, వివిధ శాఖలు మధ్య ఉండాల్సిన సమన్వయంపై అధికారులు చర్చించారు. తర్వాత రాజశేఖర్ మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ విభాగాలు కలిసి పనిచేయాలన్నారు. హాస్టళ్లలోని బాలికల భద్రతపై తరచూ ఆరా తియ్యడంతోపాటు, కౌమార దశలో ఉండే పిల్లలకు ఆన్‌లైన్, డిజిటల్ భద్రత గురించి, ఇంటర్నెట్ వినియోగం గురించి తెలియజేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమవంతు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐఎఫ్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండప్ప, హ్యాండ్స్ డైరెక్టర్ నారాయణస్వామి, ఇతర అధికారులు శ్రీదేవి, శ్రీని వాసరావు, సీఐ వెంకటేశ్వర్లు, పలు అధికారులు పాల్గొన్నారు.

రేపు క్రీడాపోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20న వివిధ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. అనివార్య కారణాలతో ఈనెల 17న నిర్వహించాల్సిన క్రీడా పోటీలు వాయిదా వేశామన్నారు. వాయిదా వేసిన ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలను ఈనెల 20న అండర్-19 అథ్లె టిక్స్ బాల, బాలికలకు ఆర్ట్స్ కాలేజీలో నిర్వహిస్తామ న్నారు. అదే రోజు బాక్సింగ్, జిమ్నాస్టిక్, వెయిట్‌లిఫ్టింగ్ అండర్-14, 17, 19 విభాగాల్లో బాల, బాలికలకు అశోక్ నగర్‌లోని డీఎస్ ఇండోర్‌స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. సాఫ్ట్‌టెన్నిస్ అండర్-14, 17, 19 బాల, బాలికల విభాగాల్లో క్రీడాపోటీలు నారాయణ టెన్నిస్ అకాడమీలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

రెండు రోజులు పెన్‌డౌన్

బుక్కపట్నం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖలో నూతన విధానాలను వ్యతిరేకిస్తూ రెండు రోజుల పాటు దస్తావేజులేఖరులు పెన్‌డౌన్ ప్రకటించినట్లు ఆ సంఘం నాయకులు తెలిపారు. ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఆధార్, ఓటీపీ, సాఫ్ట్‌వేర్ వల్ల డాక్యుమెంట్ల తయారీలో తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కొన్నివిధానాల్లో మార్పులు తీసుకు రావాలని రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజుల పాటు పెన్‌డౌన్ చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సైతం ఆందోళన నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

బస్సు ఢీకొని ఒకరి మృతి


ఓబులేసు(ఫైల్)

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హిమాలయ లాడ్జి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన ఓబులేసు(59) మృతి చెందగా నాగరాజు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణానికి చెందిన ఓబులేసు, నాగరాజు టీ తాగేందుకు వినాయకసర్కిల్‌కు వెళ్తుండగా బెంగళూరు నుంచి రాయదుర్గానికి వస్తున్న ఓ ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. చికిత్స పొందుతూ ఓబులేసు మృతి చెందాడు. నాగరాజు ను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జయనాయక్ తెలిపారు.

లాటరీ ద్వారా బార్ల కేటాయింపు: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు బార్లకు లాటరీ ద్వారా లైసెన్స్‌లు కేటాయించినట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం లాటరీ ద్వారా బార్ల లైసెన్స్ దారులను ఎంపిక చేశారు. జిల్లాలో ఐదుబార్లకు అనుమతులు రాగా, మూడు బార్లకు మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందునాయక్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేదర కులస్థులను ఆదుకోవాలి

- మేదర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు


వృత్తిదారులను సత్కరిస్తున్న మేదర కుల సంఘం నాయకులు

అనంతపురం టౌన్, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): మేదర కులస్థులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఆ కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీఎం నాగరాజు డిమాండ్ చేశారు. ప్రపంచ వెదురు దినోత్సవాన్ని గురువారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించా రు. కార్యక్రమానికి నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిం చారు. మేదర కులస్థులు వెదురుబొంగులు కొని గంపలు, చాటలు, తడికెలు, విసనక్రరలు, జల్లెడలు, పురిటి ఉయ్యాలలు తయారుచేసి ఊరూరా తిరిగి అమ్ముకుంటూ అర్ధసంచార జీవనం గడుపుతున్నారన్నారు. మారుతున్న కాలానుగుణంగా ప్రజలంతా ప్లాస్టిక్ పరికరాలవైపు మళ్లడంతో బొంగులతో చేసిన పరికరాలను విక్రయించుకోలేక ఇబ్బంది పడుతున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా మూడు రాష్ట్రాలు మినహా మిగిలిన రాష్ట్రాలన్నీ మేదర కులస్థులను ఎస్టీ జాబితాలోకి చేర్చాయన్నారు. ఏపీలోనూ మేదర కులస్థులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం పలువురు మేదర వృత్తిదారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మేదర సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్ర, గౌరవాధ్యక్షుడు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, మహేష్, మధు, కులపెద్దలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విష జ్వరంతో విద్యార్థి మృతి


మృతుడు షేక్ మొహమ్మద్ షాహిద్ (ఫైల్)

ముదిగుబ్బ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న షేక్ మొహమ్మద్ షాహిద్(13) వైరల్ ఫీవర్, నిమోనియాతో మృతిచెందినట్లు మండల వైద్యాధికారి రాజేంద్ర తెలిపారు. స్థానిక గేటు కొట్టాలకు చెందిన విద్యార్థి తండ్రి బాబ్జాన్ పంక్చర్‌షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. బాలుడికి అనారోగ్యంగా ఉండటంతో కదిరిలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఫలితం లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి, అక్కడి నుంచి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందినట్లు తెలిపారు.

ఉద్యోగం రాలేదని ఆత్మహత్య


వెంకటేశ్(ఫైల్)

పరిగి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సేవామందిరం చెక్‌పోస్టు సమీపంలో నివాసముంటున్న వెంకటేశ్(37) గురువారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఏఎస్ఐ బాలరాజు తెలిపిన మేరకు వెంకటేశ్ ఈ ఏడాది టీచర్ ఉద్యోగం కోసం డీఎస్సీ పరీక్షలు రాశాడు. ఉద్యోగం రాకపోవడంతో కుంగిపోయాడు. ఈక్రమంలోనే ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం సమీపంలో ఉన్న ఇటుకలబట్టీ రేకులషెడ్డులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్, వాలీబాల్ క్రీడాకారుడు కావడంతో పలువురు తోటి క్రీడాకారులు, స్నేహితులు సంతాపం వ్యక్తం చేశారు.

మహిళా రైతు ఆత్మహత్య


నల్లమ్మ (ఫైల్)

గార్లదిన్నె, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనకచెర్ల గ్రామంలో మహిళా రైతు బోయ నల్లమ్మ (37) గురువారం ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు పెనకచెర్లకు చెందిన బోయ చితంబరయ్య తన భార్య నల్లమ్మతో కలిసి తమకున్న 5 ఎకరాల పొలంలో చీనీచెట్లు సాగుచేసుకుని జీవించేవారు. వారికి ఇద్దరు కుమారులు. గత మూడేళ్ల నుంచి పంట దిగుబడి రాలేదు. దీనికి తోడు బోరుబావుల్లో నీరు ఇంకిపోయాయి. దీంతో చీనీచెట్లను కాపాడుకునేందుకు 4 బోర్లు వేశారు. సుమారు రూ.10 లక్షలకు పైగా అప్పులు అయ్యాయి. పంట దిగుబడి రాక వచ్చిన దిగుబడికి గిటుబాటు ధర లేక ఆర్థికంగా దెబ్బతిన్నారు. దీంతో అప్పులు ఎలా తీర్చేదంటూ దంపతులు తరచూ మథనపడేవారు. ఈక్రమంలోనే జీవితంపై విరక్తి చెందిన నల్లమ్మ గురువారం చీనీపంటకు ఉపయోగించే పురుగు మందును తాగారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌కు మూడు అదనపు స్టాపింగ్‌లు

గుంతకల్లు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్‌లో గుంతకల్లు మీదుగా వెళ్లే రాయలసీమ ఎక్స్‌ప్రెస్ (12793) రైలుకు ఈనెల 20 నుంచి మూడు రైల్వే స్టేషన్లలో స్టాపింగ్ కల్పించినట్లు రైల్వే అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ రైలును సేడం, నవాండి, తాండూరు స్టేషన్లలో ప్రయోగాత్మకంగా ఒక నిమిషం ఆపనున్నట్లు తెలిపారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (12794)కు ఇదివరకే ఈ స్టేషన్లలో స్టాపింగ్‌ను కల్పించినట్లు వెల్లడించారు.

న్యూస్ బాక్స్

అంగీకార్-2025 పోస్టర్ల ఆవిష్కరణ

ధర్మవరం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో పీఎంఏ 2.0ను ప్రారంభించి, అంగీకార్-2025 బ్రోచర్‌ను గురువారం మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ సాయికృష్ణ, హౌసింగ్ డీఈ శంకర్‌లాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పీఎంఏ, పీఎం సూర్యఘర్ ఉచిత విద్యుత్ యోజన ప్రయోజనాలపై సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు అంగీకార్ ప్రచార కార్యక్రమాన్ని చేప ట్టామన్నారు. మున్సిపాలిటీ టీపీఆర్‌ఓ విజయభాస్కర్, మేనేజర్ రాజేశ్వరి, టిడ్కో అధికారి తిరుమణి, సిబ్బంది రమేశ్‌నాయక్, హౌసింగ్ ఏఈ చిరంజీవి, మెప్మా అధికారి లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అన్ని సచివాలయాల్లో గ్రీవెన్స్: తహసీల్దార్

తనకల్లు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని సచివాలయాల్లో శుక్రవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించాలని తహసీల్దార్ షాబుద్దీన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ సచివాలయాల్లో ప్రతి శుక్రవారం తప్పకుండా గ్రీవెన్స్ నిర్వహించాలన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

28న రామాయణంపై క్విజ్ పోటీలు

ధర్మవరం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కళాజ్యోతి వారి సౌజన్యంతో ఈనెల 28న వాల్మీకి రామాయణంపై క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్టు గీతా భక్తమండలి సభ్యుడు దేవత వెంకటనాగరాజు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలు పోటీల్లో పాల్గొనే వారు ఎలాంటి ఫీజు చెల్లించకుండా, ఉదయం 9 గంటల్లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 7891056665, 9440506071 నంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై వినతి

కదిరి అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్క రించాలని కోరుతూ గురువారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు జనార్దన్, సీఐటీయూ నాయకుడు సాంబశివ మాట్లాడుతూ కార్మికుల ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సీఐటీయూ నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, రఫీ, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

'మన డబ్బులు-మన లెక్కలు' పై ర్యాలీ

తనకల్లు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): 'మన డబ్బులు- మన లెక్కలు' కార్యక్రమంపై గురువారం మండలకేంద్రంలోని చౌడేశ్వరీ మండల సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలు ర్యాలీ నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు ఇక నుంచి షర్ప్ సీఈఓ రూపొందించిన యాప్ ద్వారానే సంఘానికి సంబంధిన అన్నివిషయాలను తెలుసుకోవచ్చని వివరించారు.

దస్తావేజు లేఖరుల కార్యవర్గం ఎంపిక


నూతన కార్యవర్గ సభ్యులు

ధర్మవరం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దస్తావేజు లేఖరులు, వారి సహా యకుల నూతన కార్యవర్గాన్ని ఎంపికచేశారు. వారు గురువారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణలో సమావేశమయ్యారు. అధ్యక్షుడిగా క్రిష్ణాపురం జావీద్ బాషా, ఉపాధ్యక్షుడిగా బారు భాస్కర్, సెక్రటరీగా జూటూరు మహేంద్ర, జాయింట్ సెక్రటరీగా తొండమాట నాగార్జున, కోశాధికారిగా శింగేటి మల్లికార్జునను ఎన్నుకున్నారు.

బస్ షెల్టర్‌ను కప్పేసిన ముళ్లపొదలు

నల్లచెరువు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని జాతీయ రహదారికి అనుకుని ఉన్న దేవరింటిపల్లి బస్‌షెల్టర్ ప్రాంతలో అపరిశుభ్రత నెలకొంది. బస్టాప్ చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు ఏపుగా పెరిగి పోయింది. ఆ ప్రాంతం చెత్తచె దారంతో నిండిపోయింది. ఇతర ప్రాంతాల నుంచి మండలంలోని ప్రసిద్ధి చెందిన పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి దేవస్థానానికి వెళ్లే భక్తులు ఈ బస్టాప్ వద్దే దిగుతారు. బస్సు, ఆటోల కోసం వారు ఇక్కడ నిలబడాల్సి వస్తుంది. అయితే బస్టాప్ వద్ద అపరిశు భ్రంగా ఉండడంతో మహిళలు, వృద్ధులు కూర్చోవాలంటే నీడలేకుండ పోయిందని పలువురు భక్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్ షెల్టర్‌ను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.


దేవరింటిపల్లి బస్‌షెల్టర్ చుట్టూ ఏపుగా పెరిగిన ముళ్లపొదలు

పర్యావరణాన్ని పరిరక్షించాలి: పర్వీన్‌బాను


స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న పర్వీన్ బాను, నాయకులు

కదిరి, సెప్టెంబరు18(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ పర్వీన్ బాను పేర్కొన్నారు. పట్టణంలోని ఐదో వార్డులో ఉన్న మున్సిపల్ పార్కులో గురువారం చెట్లు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. స్థానికులతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాదున్నీషా, వైస్ ఛైర్మన్ రాజశేఖరాచారి, టీడీపీ నాయకులు కేఎస్ బాహాద్దీన్, శిరి బాబాయ్య, బండారు మురళి, ఓం ప్రకాష్, నాస్పిర్, టీడీపీ ఐదో వార్డు ఇన్‌చార్జ్ ఇమ్రాన్, కౌన్సిలర్లు కిన్నెర కళ్యాణ్, మహబూబ్‌బాషా, పలువురు మహిళలు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి: డీఎంహెచ్ఓ


అగ్రహారం గ్రామంలో స్టాల్స్‌ను సందర్శిస్తున్న డీఎంహెచ్ఓ

కదిరి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సీజన్‌లో జ్వరాలు ప్రబలుతున్నాయని, ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ ఫైరోజ్ బేగం పేర్కొన్నారు. ఆమె గురువారం పట్టణంలోని నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లతో పాటు నల్లచెరువు మండలంలోని ఎం. అగ్రహారంలో పర్యటించారు. ఎం. అగ్రహారం ప్రాథమిక కేంద్రంలో మహిళ ఆరోగ్యం, కుటుంబ పరిరక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శించారు. ఆమెతోపాటు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేంద్రనాయక్, వైద్యాధికారులు అలేఖ్య, కల్పన, జంషీర్, ఉషా, వైద్య సిబ్బంది దేవలనాయక్, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

'యూరియా సమస్య పరిష్కరించాలి'

కదిరిఅర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నెలకున్న యూరియా సమస్యను పరిష్కరించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ మురళీక్రిష్ణకు వినతిపత్రం అందించారు. రైతుల సేవా కేంద్రాల వద్దకు రైతులు వెళితే పాస్ పుస్తకానికి ఒక యూరియా బస్తా మాత్రమే ఇస్తున్నారని, ఇంకొకటి డీఏపీ ఇస్తున్నారని తెలిపారు. ఫర్టిలైజర్ దుకాణాలకు వెళితే డీఏపీ, ఇతర ఎరువులు కొనుగోలు చేస్తేనే యూరియా ఇస్తామంటున్నారని తెలిపారు. రైతులకు సరిపడే యూరియా సరఫరా లేకపోవడంతోనే సమస్య తలెత్తుతోందని అన్నారు.

లోచర్ల చెరువులో గంగపూజ


గంగపూజ చేస్తున్న టీడీపీ నాయకులు

కొత్తచెరువు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోనిలో చెరువుకు ఎమ్మెల్యే పల్లె సిధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆదేశాలతో ఇరిగేషన్, హంద్రీనీవా అధికారులు హంద్రీనీవా కాలువద్వారా నీటిని విడు దల చేశారు. గురువారం చెరువు నిండి మరువ పారుతోంది. నియోజకవర్గంలోనే ఈ ఏడు తొలిసారిగా లోచర్ల చెరువు నిండడంతో లోచర్ల, తిప్పాబట్లపల్లికి చెందిన రైతులు, టీడీపి నాయకులు గంగపూజ చేశారు. గంగమ్మకు పసుపు, కుంకుమ, చీరసారె సమర్పించారు.

కలెక్టర్‌కు ఉద్యోగుల సన్మానం


కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను సన్మానిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

కొత్తచెరువు, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు, ఉద్యోగులు గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ చాంబర్‌లో ఘనంగా సన్మనించారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువా కప్పి సన్మానించినట్లు ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినయ్‌మోహన్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి,రామాంజినేయులు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులు లోకేశ్వర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, రమణ, సాయి ప్రకాష్, ఓబులేసు, రజితమ్మ, భాస్కర్‌రెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ

నంబులపూలకుంట/గాండ్లపెంట/నల్లమాడ, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నంబులపూలకుంట మండలంలోని మేకలచెరువు, మరి కొమ్మెదిన్నె రైతు సేవా కేంద్రాల వద్ద గురువారం యూరియా పంపిణీ చేశారు. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున 280మందికి అందించినట్లు తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఏఓ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. అలాగే గాండ్లపెంట, మండలంలోని సోమయాజులపల్లి, గొడ్డివెలగల రైతు సేవా కేంద్రాల్లో రైతులకు యూరియా పంపిణీ చేసినట్లు ఏఓ షాదాబ్ తెలిపారు. ఒక్కో రైతు సేవా కేంద్రానికి 6.3 టన్నులు చొప్పున వచ్చిందని కావలసిన రైతులు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ బాబురావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. నల్లమాడ మండలంలోని కురమాల, దొన్నికోట రైతు సేవాకేంద్రాల్లో గురువారం యూరియాను టోనక్ల పద్ధతిలో పంపిణీ చేసినట్లు ఏఓ మహమ్మద్‌హక్ తెలిపారు. ఒకొక్క రైతుకు ఒక బస్తా యూరియా అందించామన్నారు. అవసరమైన రైతులకు అదజేస్తామన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● వీఆర్‌ఏల డిమాండ్... ధర్నా


కొత్తచెరువు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

కొత్తచెరువు/ముదిగుబ్బ/నల్లచెరువు, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏల సమస్యలను తక్షణమే పరిష్కరిం చాలని వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్దన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరిం చాలంటూ గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. శాంతి యుత ధర్నాను ఉధృతం చేస్తామన్నారు. మండలంలోని వీఆర్‌ఏలు పాల్గొన్నారు. అలాగే ముదిగుబ్బ తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్‌ఏలు చేపట్టిన ధర్నాకు సీపీఐ నాయకులు సంఘీ భావం తెలిపారు. వీఆర్‌ఏలు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో తహసీల్దార్ నారాయణస్వామికి అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. నల్లచెరువు: తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏలు గురువారం ధర్నా చేప ట్టారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ రవినాయక్‌కు అందించారు. వీఆర్‌ఏలు పతి, రవి, రమణ, మారుతి, అంజలిబాయి, వెంకటదాస్ తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి బ్యాడ్మింటన్ టోర్నీ

ధర్మవరం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి జన్మదినాలను పురస్కరించుకుని ఈనెల 26 నుంచి 28వరకు ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్టు బీజేపీ జిల్లా కార్యదర్శి డోలా రాజారెడ్డి తెలిపారు. ఆయన గురువారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ... నియోజకవర్గంలో ఉన్న షటిల్ క్రీడాకారులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ టోర్నీలో పాల్గొనే వారు ఎంట్రీ ఫీజు రూ.300ను ఈ నెల 24వ తేదీలోగా చెల్లించాలని తెలిపారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

● సీఐటీయూ నాయకులు

ధర్మవరం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేశ్‌పై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌హెచ్ బాషా, మండల కన్వీనర్ అయూబ్‌ఖాన్ డిమాండ్‌చేశారు. వారు గురువారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బుక్కపట్నంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేశ్‌పై ఈ నెల 16న వెలుగు సీసీ రవీంద్ర, బుక్ కీపర్ నాగరాజు దాడిచేశారన్నారు. కావున దాడి చేసిన వారితో పాటు డీఆర్‌డీఏ పీడీపై కూడా పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్‌చేశారు.

● ఓబుళదేవరచెరువు: సీఐటీయూ నాయకుడు వెంకటేశ్‌పై దాడులకు పాల్పడిన వెలుగు సీసీ రవీంద్ర, బుక్‌కీపర్ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల శాఖ డిమాండ్ చేసింది. సీపీఎం మండల కార్యదర్శి కుళ్లాయప్ప, నాయకుడు సున్నపల్లి రమణ గురువారం మండలకేంద్రంలో మాట్లాడారు.

డీలర్లకు ఈ-పోస్ మిషన్ల పంపిణీ

బత్తలపల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఈ - పోస్ మిషన్ల్‌తో చౌక డిపోల్లో అవినీతి అక్ర మాలకు తావు లేకుండా చేసింది చంద్రబాబే అని స్టోర్ డీలర్లు పేర్కొన్నారు. మండలంలోని స్టోర్ డీలర్లకు గురువారం ఆర్డీఓ కార్యాలయంలో ఈ పోస్ మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్టోర్ డీలర్లు మాట్లాడుతూ... గతంలో ఈ పోస్ మిషన్లు లేనప్పుడు చౌక డిపోల్లో ప్రభుత్వం సబ్సిడీతో ఇచ్చే సరుకులను ప్రజలకు అందించ కుండా భారీగా అక్రమాలు జరిగేన్నారు. దీంతో 2015లో సీఎం చంద్రబాబు స్టోర్లకు ఈ పోస్ మిషన్లు పంపిణీ చేసి అక్రమాలకు చెక్ పెట్టారని అన్నారు. అవి పాతవి అయి పనిచేయక పోవడంతో ఇప్పుడు కొత్త టెక్నాలజీతో ఈ పోస్ మిషన్లను పంపిణీ చేశారని తెలిపారు.

మహిళలకు వైద్య పరీక్షలు

ధర్మవరం రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వసంతపురం గ్రామంలో వైద్యాధికారి దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాంబశివమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్‌రెడ్డి, ఏఎన్‌ఎంలు, బీజేపీ నాయకులు నారా కొండయ్యచౌదరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో బ్లూమూన్ విద్యార్థుల ప్రతిభ

కదిరి అర్బన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): జీకేఎంఎఎస్ నేషనల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో కదిరి బ్లూమూన్ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో పథకాలు సాధించినట్లు ఆ విద్యాసం స్థల ఛైర్మన్ శివశంకర్ గురువారం తెలిపారు. తమ పాఠశాల, కళాశాల విద్యార్థులు లిఖిత, పావని, మనోహర్ కటా, కుబుతే విభాగాల్లో బంగారు పతకాలు, విష్ణువర్ధన్ వెండి, జగదీష్ కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. అలాగే జిల్లా స్థాయి ఫెన్సింగ్, రైఫిలింగ్, షూటింగ్, కరాటే పోటీల్లో పలువురు ప్రతిభ చాటినట్లు తెలిపారు. వారిలో హిప్సీ, షా బర్, విష్ణు, మనోహర్, పావని, వెన్నెల రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలి పారు. వారిని పాఠశాల సిబ్బంది అభినందించారు.

పేకాట ఆడుతున్న ఆరుగురి అరెస్ట్

బత్తలపల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిత్రావతి నది సమీపంలో గురువారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.8,260 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అట్టహాసంగా 'పల్లె' జన్మదిన వేడుకలు


జిల్లా కేంద్రంలో అభిమానుల మధ్య కేక్ కట్ చేస్తున్న మాజీమంత్రి పల్లె

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి గురువారం జన్మదిన వేడుకలను అభిమానుల మధ్య అట్టహాసంగా జరుపుకున్నారు. పలువురు పట్టణ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, వ్యాపారులు, యువత, ఆటో డ్రైవర్లు, రాజకీయ నాయకులు భారీ పూలమాలలు, కేక్‌లను పట్టణంలోని పల్లె క్యాంపు కార్యాలయానికి తీసుకెళ్లి ఆయనను ఘనంగా సన్మానించారు. అంతకు మునుపు అనంతపురం నుంచి పుట్టపర్తికి చేరుకున్న మాజీ మంత్రి స్థానిక సత్యమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక హనుమాన్ కూడలిలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదికపై క్రేన్ సాయంతో ఆయనను భారీ గజమాలలతో సన్మానించి, భారీకేక్ కట్‌చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా, నియోజకవర్గం నుంచి అభిమానులు, నాయకులు, కార్యకర్తలు భారీస్థాయిలో పల్లె క్యాంపు కార్యాలయానికి తరలివచ్చారు. వారికి మాజీమంత్రి భోజన వసతి, తేనేటి విందు ఏర్పాటుచేశారు. కూటమి నాయకులు రామాంజనేయులు, విజయ్ కుమార్, మల్‌రెడ్డి, జయచంద్ర, మైలే శంకర్, గోపాల్‌రెడ్డి, సామకోటి ఆదినారాయణ, రామారావు, లక్ష్మీపతి, గంగాధర్‌నాయుడు, ఓబులేసు, శ్రీరాంరెడ్డి, పుల్లప్ప, ఒలిపి శ్రీనివాసులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు,


నల్లమాడలో సత్యమ్మ దేవతకు పూజలు చేస్తున్న దృశ్యం

● నల్లమాడ: మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం మండలకేంద్రంలోని బస్టాండ్ కూడలిలో ఘనంగా నిర్వహించారు. సత్యమ్మ దేవతకు ప్రత్యేక పూజలు చేసి, కేక్ కట్ చేశారు. 30 పడకల ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అలాగే మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్, సింగల్ విండో అధ్యక్షుడు గడ్డం రమణారెడ్డి, మాజీ కన్వీనర్ కేశవరెడ్డి, బుట్టి నాగభూషణనాయుడు, కోట్లో మంజునాథ్‌రెడ్డి, ఉత్తమరెడ్డి, పులగంపల్లి సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, గుండ్ర శివారెడ్డి, జయశంకర్‌నాయుడు, గంగులప్పనాయుడు, వెంకటరమణనాయుడు, పెద్దప్పయ్యనాయుడు, సలాంఖాన్, రాజారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎస్‌డీఆర్‌ఆర్ కళాశాలలో రక్తదానం చేస్తున్న యువకులు

● ముదిగుబ్బ: మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని ఎస్‌డీఆర్‌ఆర్ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కదిరి ప్రభుత్వాసుపత్రి బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, ఇతరులు మొత్తం 41 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీఆర్‌ఆర్ డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు ప్రకాష్‌రెడ్డి, శివారెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, సురేష్, అధ్యాపకులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, సుధాకర్, నారాయణస్వామి, ఇబ్రహీం పట్నం ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.


దేవాలయంలో శ్రమదానం చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

● ఓబుళదేవరచెరువు: మండలంలోని గాజుకుంటపల్లి సాయిబాబా దేవాలయంలో గురువారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు శ్రమదానం చేశారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా దేవాలయం ఆవరణంలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలను, తొలగించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు కేఫ్ ఆంజి, బీజేపీ మండలాధ్యక్షుడు ఇడగొట్టు అంజనేయులు, టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, సోముశేఖర్, తరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పుట్టపర్తిలో నేతలు రామారావు, లక్ష్మీపతి, కోనంకి గంగాధర్ ఆధ్వర్యంలో..

● బుక్కపట్నం: మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. బుక్కపట్నంలోని తేరు కూడలిలో కేక్ కట్ చేశారు. సత్యసాయి కల్యాణమండపంలో రక్తదాన శిబిరాన్ని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి ప్రారంభించారు. దాదాపు 50 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ కన్వీనర్ ఎర్ర కేశప్ప, లైవ్‌స్టాంగ్ రాష్ట్ర డైరెక్టర్ సాకే యశోద రాయుడు, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, తెలుగు మహిళ అధ్యక్షురాలు లావణ్యగౌడ్, నాయకులు బాలు, సయ్యద్, సాకే నరేష్, అక్కులప్ప, కుమార్, జెండాల రామాంజి, తెలుగుయువత సతీష్‌రాయల్, బుచ్చయ్యగారిపల్లి చంద్ర, కరణం సూరి, సుధీర్, మంజు, ఆంజి, శ్రీరాములు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిని సన్మానిస్తున్న బుక్కపట్నం నాయకులు


అనంతపురంలో పల్లెను గజమాలతో సన్మానిస్తున్న కొత్తచెరువు నాయకులు

● కొత్తచెరువు: మాజీ మంత్రి పల్లె రఘు నాథరెడ్డి జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రానికి చెందిన టీడీపీ నాయకులు అనంతపురంలోని ఆయన నివాసంలో, పీవీకేకే కళాశాలలో పల్లెను గజమాలలు, పూలహారాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కొత్త చెరువుకు వచ్చిన మాజీ మంత్రి ఎన్టీఆర్ విగ్ర హానికి పూలమాల వేసి కార్యకర్తలు, నాయకులు ఏర్పాటుచేసిన భారీ కేక్ కట్ చేశారు. నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, కాం ట్రాక్టర్ లక్ష్మీ నారాయణ, పీవీ శివప్రసాద్, కన్వీనర్‌లు అడపాల రామ కృష్ణ, ఒలిపి శీన, నాయకులు అప్పకొండప్పగారి హరిప్రసాద్, నాగేంద్రప్రసాద్, జేసీజీ చలం, సుబ్బరాయుడు, బండ్లపల్లి రాజు, మాణిక్యంబాబా, వెంకటరెడ్డి, సుధీర్‌కుమార్, నల్లమాడ శంకర్, శ్రీనివాస ప్రసాద్, మహేశ్, హర్షాచౌదరి, పోలినేని మాధవి, కొడపగానిపల్లి శివ, కేశప్ప, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


పీవీకేకే కళాశాలలో పల్లెను సన్మానిస్తున్న కొత్తచెరువు నాయకులు

● ఓబుళదేవరచెరువు: మాజీ మంత్రి పల్లె జన్మదిన వేడుకల సందర్భంగా మండలకేంద్రం, కొండకమర్ల గ్రామంలోని టీడీపీ కార్యాలయాల్లో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కేక్‌లు కట్ చేశారు. ఓడీ చెరువు టీడీపీ కార్యాలయం, ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం చేశారు. అలాగే గాజుకుంటపల్లిలో టీడీపీ నాయకుడు తరుణ్‌కుమార్, బీజేపీ మండలాధ్యక్షుడు ఇడగొట్టు వీరంజి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, సహకార సంఘం ఛైర్మన్లు తుమ్మల మహబూబ్ బాషా, బోయపల్లి శివారెడ్డి, తెలుగు యువత బూదిలి ఓబులరెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్లు నిజాం, బుద్దల ప్రవీణ, కంచి సురేష్, ఆర్‌ఎంపీ జాకీర్, గ్రామ కమిటీ అధ్యక్షులు కెఫ్ అంజనేయులు, కమ్మల సోమశేఖర్, ప్రభాకర్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, మల్లి, మండోజీ ఆర్ఫీఖాన్, జౌళి అల్లా బకాష్, లక్ష్మీపతి నాయుడు, సుధాకర్ నాయుడు, సింగిల్ విండ్ శంకర్, సాధిక్ వలి, కొత్త సుధాకర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నిజాం వలి తదితరులు పాల్గొన్నారు.


ఓడీసీలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

న్యూస్ బాక్స్

12వ పీఆర్‌సీ ప్రకారం జీతాలు చెల్లించాలి



నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

పెనుకొండ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్నవారికి 12వ పీఆర్‌సీ ప్రకారం జీతాలు చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బాబావలి, యూనియన్ నాయకులు వెంకటేశ్ డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 11వ పీఆర్‌సీ గడువు పూర్తయ్యి రెండేళ్లు గడిచిందని, ఇంతవరకు 12వ పీఆర్‌సీ కమిటీని వేయలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం 12వ పీఆర్‌సీ వెంటనే ఏర్పాటు చేసి కార్మికులందరికీ జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, మహబూబ్‌బాష, నరసింహ, ఆనంద్, హబీబ్, వెంకటేశ్, సూరి, ఆదెమ్మ, నరసమ్మ, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోండి

ఈనెల 16న బుక్కపట్నం వెలుగు కార్యాలయంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్‌పై దాడిచేసిన వారిపై కేసులు నమోదుచేసి వెంటనే శిక్షించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. వెలుగు కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు సంబంధించి రూ.8లక్షలు అవినీతి జరిగిందని ప్రశ్నించడానికి వెళ్లిన జిల్లా కార్యదర్శి వెంకటేశ్‌పై సీసీ రవీంద్ర, బుక్‌కీపర్ నాగరాజు, దాడిచేయడం అమానుషం అన్నారు. వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పరిగి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. కదిరి ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా పరిగి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు హర్షవల్లి, మంజుల, గంగమ్మ, పరిగి గ్రామానికి చెందిన యశ్వంత్ అనే విద్యార్థి కబడ్డీలో పాల్గొనగా వీరు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ప్రతిభ చాటిన విద్యార్థులను హెచ్‌ఎం కృపాసత్యరాజ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

'పోలీసులపై ఫిర్యాదు చేస్తాం'



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గోరంట్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ నెపంతో నరేష్ అనే వ్యక్తిని స్టేషన్‌కు తీసుకొచ్చి హింసించారని.. ఈ ఘటనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ హంపయ్య, నరేష్ సోదరుడు మహేష్ తెలిపారు. నరేష్ సోదరులు మహేష్, లోకేష్, మామ హంపయ్య గురువారం గోరంట్లలో విలేకరులతో మాట్లాడుతూ.. పోలీసుల కౌన్సెలింగ్‌తో మనస్థాపం చెందిన నరేష్, పోలీస్ స్టేషన్ ఎదుట డీజిల్ పోసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. 2014లో రెండు కేసులు నమోదయ్యాయని, కోర్టులో పరిష్కారమయ్యాయని వివరించారు. అయినా స్టేషన్‌ను పిలిపించి హింసించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. గత ఐదేళ్లుగా అనంతపురంలో ఉంటూ, ఒక్కసారికూడా గోరంట్లకు రాలేదని, అయినా తనపై ఇటీవల జరిగిన ఆర్‌అండ్‌బీ గోడ కూల్చివేత కేసు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమని మహేష్ ప్రశ్నించారు. ఆత్మహత్య యత్నం అనంతరం గోరంట్ల నుంచి వెళ్లిపోయిన నరేష్ కదిరి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. అతడికి ప్రాణాపాయం జరిగితే పోలీసులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

జూదరుల అరెస్ట్

హిందూపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మణేసముద్రం వద్ద గురువారం పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేశారు. అప్‌గ్రేడ్ సీఐ ఆంజనేయులు, సిబ్బందితో పేకాట స్థావరంపై దాడిచేయగా ముగ్గురు జూదరులు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.15వేల నగదు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వస్తున్నారన్న సమాచారం అందుకున్న జూదరులు కొంతమంది పరారయ్యారు. పట్టణ పరిధిలోని మోడల్ కాలనీలో గంజాయి విక్రయిస్తున్నవారిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

● రొద్దం : మండలంలోని లక్కసానిపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. గురువారం రొద్దం మండల పరిధిలోని లక్కసానిపల్లి శివారులో పేకాట స్థావరంపై దాడిచేయగా రూ.14వేలు నగదు సీజ్‌చేసి ఆరుగురిని అరెస్ట్‌చేసినట్లు తెలిపారు. ఇంకా తొమ్మిది మంది పరారైనట్లు వివరించారు.

ఆసుపత్రి భవనాన్ని పరిశీలించిన అధికారులు

పరిగి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కొడిగెనహళ్లి పంచాయతీ పరిధిలో దాదాపు 15వేల మంది జనాభా ఉంది. ఇక్కడ ప్రభుత్వ ఆసుపత్రి లేకపోవడంతో పరిగిలోని ప్రాథమిక వైద్యశాలను ఆశ్రయించాల్సి వస్తోంది. దీనిపై స్థానికులు హెల్త్ నోడల్ ఆఫీసర్ అనిల్‌కుమార్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన స్పందించి తహసీల్దార్, వైద్య సిబ్బందిని స్థలాన్ని పరిశీలించి పురాతన ఆసుపత్రి భవనాలను పడగొట్టి నూతన భవనం ఏర్పాటు చేసేందుకు నివేదిక ఇవ్వాలని సూచించారు. దీనిపై గురువారం తహసీల్దార్ హసీనాసుల్తానా, డాక్టర్ స్వరూప్ రెడ్డి పురాతన భవనాన్ని పరిశీలించి నివేదికలు పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



పురాతన ఆసుపత్రి భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మూగ జీవాలకు మందుల కొరత

● ప్రైవేటు దుకాణాల్లో కొనుగోలు
● ఇబ్బంది పడుతున్న పాడిరైతులు

మడకశిర రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పశువైద్యశాలలో మందుల కొరత కారణంగా మూగ జీవాలు తల్లడిల్లుతున్నాయి. మండలంలో కల్లుమర్రి, మడకశిర, గుండుమల, నీలకంఠాపురం పశు వైద్యశాలలు ఉన్నాయి. ఏళ్ల తరబడి డాక్టర్లు లేరు. రోగాలు వస్తే పశువులను కాపాడుకోవడానికి కనీసం మందులు కూడా లేవు. దీంతో పాడి పశువులకు సకాలంలో వైద్యసేవలు అందక మృత్యువాతన పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. వైద్యసిబ్బందిని అడిగితే మందులు కొరత లేదు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని పశువులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ పెంచలయ్యను వివరణ కోరగా.. ప్రస్తుతం పశువైద్యశాలల్లో మందుల కొరత ఉందన్నారు. త్వరలో అన్ని ఆసుపత్రులకు కావలసిన మందు వస్తాయని వివరణ ఇచ్చారు.

బయట కొనుగోలు చేస్తున్నాం

ప్రభుత్వ వైద్యశాలలో మందుల కొరత అధికంగా ఉంది. పాడి ఆవు మేతకు వెళ్లినప్పుడు కంటికి దెబ్బతగిలింది. మడకశిర పశు వైద్యశాలకు వెళ్లలేని పరిస్థితి. ఈ విషయం పశువైద్య సిబ్బందికి దృష్టికి తీసుకెళ్లాను.





వైద్యం అందక కన్ను కోల్పోయిన ఆవు, బయట మందులు కొన్న రైతు

ఆసుపత్రికి వస్తే మందులు ఇస్తాం అన్నారు. ఇక్కడికి వచ్చాక మందులు లేవని, ప్రైవేటు మందుల షాపులో కొనుక్కోవాలని చీటీ రాసిచ్చారు. విధిలేని పరిస్థితుల్లో ప్రైవేటు షాపులో కొనుగోలు చేశాను. పశు వైద్యశాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే సేవలు అందడం లేదు.

- హనుమంతరెడ్డి, పాడిరైతు, చీపులేటి గ్రామం

ఘనంగా పల్లె రఘునాథ రెడ్డి జన్మదిన వేడుకలు

హిందూపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక సేవామందిరంలోని వృద్ధాశ్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సప్తగిరి కళాశాల అధ్యాపకులు అక్కడ కేక్‌కట్‌చేసి పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కళాశాలలో విద్యార్థులతో కలిసి కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, ఏఓ గంగిరెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, మంజునాథ్ పాల్గొన్నారు.





'పురం'లో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న అధ్యాపకులు, పెనుకొండలో కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్

● పెనుకొండ : బాలాజీ విద్యాసంస్థల అధినేత, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం స్థానిక సత్యసాయి డిగ్రీ, జూనియర్ కళాశాలలో పల్లె జన్మదినాన్ని పురస్కరించుకుని కళాశాల ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి, ఏఓ కేశవయ్య ఆధ్వర్యంలో అధ్యాపకులు, కేక్ కట్‌చేసి పల్లెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంచిపెట్టారు.

నేటి నుంచి దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్

హిందూపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన విధానాలను మార్పు చేయాలని కోరుతూ హిందూపురంలో దస్తావేజు లేఖరులు డిప్యూటీ తహసీల్దార్ మైనుద్దీన్‌కు గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా తీసుకొచ్చిన విధానాలు ఆధార్, ఓటీపీ, స్థానిక సంస్థల డేటాబేస్ ఆధారంగా ఇంటి స్థలాలు రిజిస్ట్రేషన్లు 2.0 సాఫ్ట్‌వేర్ సాంకేతిక లోపాలను సరిచేయాలన్నారు. దీనివల్ల దస్తావేజు లేఖరులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. దీంతో ప్రజలు, అటు దస్తావేజు లేఖరులు కూడా ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. వెంటనే వాటిలో మార్పు తీసుకురావాలన్నారు. శుక్ర, శనివారాలు పెన్‌డౌన్ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో దస్తావేజులేఖరుల సంఘం నాయకులు పాల్గొన్నారు.





హిందూపురంలో డీటీకి, చిలమత్తూరులో సబ్‌రిజిస్ట్రార్‌కు వినతి పత్రాలు ఇస్తున్న దస్తావేజు లేఖరులు

● పెనుకొండ : రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా ప్రవేశపెట్టిన 2.0 అనే కొత్త సాఫ్ట్‌వేర్ వల్ల విధివిధానాలకు ఆటంకం ఏర్పడుతుందని, ఓటీపీ విధానాన్ని వెంటనే రద్దుచేయాలని కోరుతూ స్థానిక శుక్ర, శనివారాలు పెన్‌డౌన్ నిర్వహిస్తున్నట్లు డాక్యుమెంట్ రైటర్స్ సంఘం నాయకులు పేర్కొన్నారు. గురువారం సబ్‌రిజిస్ట్రార్‌కు వినతిపత్రాన్ని అందించారు.

● చిలమత్తూరు: ఇటీవల రిజిస్ట్రేషన్ శాఖలో వచ్చిన మార్పులతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వాటిని పరిష్కరించాలని కోరుతూ రెండు రోజుల పాటు పెన్‌డౌన్ కార్యక్రమం చేపడుతున్నట్లు మండల దస్తావేజు లేఖరులు పేర్కొన్నారు. గురువారం వారు స్థానిక సబ్‌రిజిస్ట్రార్ ప్రసాద్‌కు పెన్‌డౌన్ కార్యక్రమంపై వినతి పత్రం అందించారు. ఈ నెల 19, 20వ తేదీల్లో మూకుమ్మడిగా దస్తావేజు లేఖరులందరూ పెన్‌డౌన్ నిరసన చేపడుతున్నామని అన్నారు. ఈ రెండు రోజుల పెన్‌డౌన్ సమయంలో కార్యాలయంలో ఎలాంటి సేవలు అందివ్వరాదని కోరారు.

అవినీతిని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా..?

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి



విలేకరులతో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి

మడకశిర టౌన్/మడకశిర రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): అవినీతి ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి మండిపడ్డారు. గురువారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ బుధవారం బుక్కపట్నం వెలుగు కార్యాలయంలో అవినీతి జరిగిందని ప్రశ్నిస్తే దాడులకు దిగడం దారుణం అన్నారు. డ్వాక్రా మహిళలు చెల్లించే పొదుపులో రూ.8లక్షలు అవినీతి జరిగిందని ప్రశ్నించడానికి వెళ్లిన నాయకులపై దాడులు చేయడం ఎంత వరకు న్యాయం అని ప్రశ్నించారు. అనంతరం మండలంలోని ఆర్. అనంతరంపురం, గౌడనహళ్లి గ్రామాల్లో రైతు సమస్యలపై ఆ గ్రామాల్లో పర్యటించారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, రవి, ముత్యాలు, ఈరేష్, వేమారెడ్డి పాల్గొన్నారు.

● సోమందేపల్లి : బుక్కపట్నం వెలుగు కార్యాలయంలో జరిగిన సంఘటనలో సీఐటీయూ నాయకుడు వెంకటేష్‌పై దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. అవినీతిని ప్రశ్నించినందుకు మహిళా గ్రామైక్య సంఘం మాజీ లీడర్ కోమల, సీసీ రవి, బుక్ కీపర్, వారి బంధువులు దాడిచేశారన్నారు. సమావేశంలో నాయకులు పెద్దన్న, వెంకటేశులు, రామక్రిష్ణప్ప, నాగభూషణం, కంబాలప్ప పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసులు

హిందూపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మలుగూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌గా జి. శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. కాళసముద్రం ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆయనను ఇక్కడికి బదిలీచేయగా గురువారం బాధ్యతలు స్వీకరించారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టిసారించాలి

అగళి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని స్థానిక సర్పంచ్ మంజుల పేర్కొన్నారు. మండలంలోని ఇనగలూరులో గురువారం మహిళల సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్‌బీ, షుగర్, క్యాన్సర్ పరీక్షలు చేశారు. కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించారు. మహిళల ఆరోగ్యాన్ని కాపాడి కుటుంబం బలపరిచే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధంచేసుకుని పనిచేయాలని పేర్కొన్నారు.

గుండెపోటుతో చేనేత కార్మికుడి మృతి

సోమందేపల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయం పరిసరాల్లో నివాసమున్న చేనేత కార్మికుడు బోయ హనుమంతు (48) గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. చేనేత వృత్తిలో కొనసాగుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. హఠాత్తుగా అతడు మృత్యువాత పడటంతో కుటుంబ పరిస్థితి తారుమారయింది.

మాజీ యానిమేటర్‌పై చర్యలు తీసుకోండి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న మహిళా సంఘం సభ్యులు

గుడిబండ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీసీగిరి గ్రామానికి చెందిన మాజీ యఆనిమేటర్ సురేష్ అక్రమాలకు పాల్పడి మహిళా సంఘ సభ్యుల నిధులను స్వాహా చేశాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ కల్యాణ్‌చక్రవర్తికి విన్నవించారు. గురువారం మండలంలోని పీసీగిరి గ్రామానికి చెందిన మహిళా సంఘం సభ్యులు పెద్ద ఎత్తున తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సురేష్ గత వైసీపీ హయాంలో యానిమేటర్‌గా పనిచేసేవాడని, మహిళలకు మాయమాటలు చెప్పి సంఘాల నిధులను సుమారు రూ.18 లక్షలు కాజేసి స్వాహా చేశాడని, దీంతో తాము అప్పులపాలయ్యామని బోరున విలపించారు. ఈ విషయమై ఎస్ఐ కుల్లాయప్పకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు మంజునాథ్, నాయకులు రంగనాథ్, సభ్యులు చంద్రకళ, మహాలక్ష్మీ, దేవిరమ్మ, సుజాతమ్మ, పుట్టమ్మ, భాగ్యమ్మ, శాంతమ్మ, గంగమ్మ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఎస్ఐ

సోమందేపల్లి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని ఎస్ఐ రమేష్ తెలిపారు. గురువారం హిందూపురం రోడ్డులో ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీ, హెల్మెట్ ధరించని వాహనదారులను ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. అతివేగం ప్రాణాంతకమని, ర్యాష్ డ్రైవింగ్‌లో పట్టుబడితే చర్యలు తప్పవన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో రక్తదానం

పావగడ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని పక్షం రోజులపాటు వివిధ ప్రజా సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు బీజేపీ తాలూకా అధ్యక్షుడు అశోక్ తెలిపారు. గురువారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో 76మంది కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ జి. వెంకట్రామయ్య, రవి, హనుమంతరెడ్డి, మంజునాథ్, మదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలి

రొళ్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉపకులాలు కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. 2004లో ఎస్సీ వర్గీకరణ రద్దు అయినప్పటి నుంచి విద్యా, ఉద్యోగ రంగాల్లో మాదిగ ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. గత యేడాది ఆగస్టు 1న వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉందని సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంతో మాదిగలకు ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు. ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్లకు నిధులు కేటాయించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐకు వినతిపత్రం అందించారు.

వైద్య కళాశాలను ప్రభుత్వమే నిర్మించాలి: సీపీఐ

పెనుకొండ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): పెనుకొండలోని మెడికల్ కళాశాలను ప్రభుత్వమే నిర్మాణ పనులు చేపట్టాలని, ప్రైవేటీకరణ చేస్తే ఉద్యమిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయనతోపాటు వివిధ ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు పట్టణంలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబరు 4న క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా 17 మెడికల్ కళాశాలల నిర్మాణాన్ని పీపీపీ పద్ధతిలో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడానికి నిర్ణయించిందని అన్నారు. ఈ విషయమై పెనుకొండలో నిర్మాణంలో ఉన్న కళాశాల భవనాన్ని పరిశీలించామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నిర్మాణాలు ఆపివేసి మిగిలిన పనులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇదే జరిగితే ప్రజలు, విద్యార్థుల ఆగ్రహాన్ని చూడాల్సి ఉంటుందన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీగా వెళ్లి ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జయరాజ్, కాటమయ్య, శ్రీరాములు, మల్లికార్జున, నరసింహులు, బాలస్వామి, రమేష్, కిష్టప్ప పాల్గొన్నారు.



మెడికల్ కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న వేమయ్య యాదవ్, నాయకులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



మహిళా సంఘాలకు చెక్కు ఇస్తున్న గుండుమల తిప్పేస్వామి, బ్యాంక్ అధికారులు

మడకశిర రూరల్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. గురువారం గుండమల గ్రామంలోని కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం పథకాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, కెనరాబ్యాంక్ ఆర్ఎం శ్రీనివాసులు, డీఎం చంద్రకాంత్ రెడ్డి, బ్యాంక్ మేనేజర్ వినయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిప్పేస్వామి మాట్లాడుతూ.. పేద ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన పథకం, ప్రమాద బీమా, బీమా యోజన పథకం, మహిళలకు రుణాలు వంటి పథకాలను గురించి వివరించారు. అనంతరం రూ.2 లక్షల చెక్‌ను మహిళా సంఘాలకు అందజేశారు.

రైతన్నకు బాలయ్య అండ

మార్కెట్ నిర్మాణానికి నిధుల మంజూరుపై నాయకుల హర్షం



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

హిందూపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతన్నకు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఎప్పటికీ అండగా ఉంటారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రమేష్, టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, నాయకులు అనిల్, బేవనహళ్లి ఆనంద్, పరిమళ, వెంకటేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అతిపెద్ద పట్టుగూళ్ల మార్కెట్‌ను ఎన్టీఆర్ హయాంలో నిర్మించగా అది శిథిలావస్థకు చేరుకుంది. దీంతో రైతులు గూళ్లను మార్కెట్‌కు తీసుకొచ్చే సమయంలో తడిచిపోయి ఇబ్బంది పడేవారని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గత యేడాది నూతన మార్కెట్ నిర్మాణం కోసం కేంద్రానికి సీఎం ద్వారా సిఫార్సు చేశారని తెలిపారు. ఇటీవల కేంద్ర మంత్రిని కలిసి నిధులు మంజూరు చేయాలని కోరారని అన్నారు. దీంతో కేంద్రం రూ.4కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. ఆ నిధులు సరిపోవని ముఖ్యమంత్రిని కలిసి మరో రూ.4కోట్లు ఇవ్వాలని కోరారని తెలిపారు. దీంతో స్పందించిన సీఎం నిధులు మంజూరు చేశారని అన్నారు. మొత్తం రూ.8కోట్లతో త్వరల్లో టెండర్లు పిలుస్తారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్ర, మంజునాథ్, రామాంజి, చెన్నమ్మ పాల్గొన్నారు.

మినీ మార్కెట్‌ను వినియోగంలోకి తెద్దాం

హిందూపురం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): లేపాక్షి రోడ్డులోని డీబీ కాలనీలో ఉన్న కూరగాయల మినీ మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకొద్దామని మున్సిపల్ చైర్మన్ రమేష్, టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం తొమ్మిదో వార్డులో వారు సమస్యలు తెలుసుకున్నారు. అదేవిధంగా మినీ మార్కెట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్కెట్‌కు అనుకూలంగా ట్రాన్స్‌ఫార్మర్‌ను రోడ్డుకు వెనుకాల మార్చాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ మల్లికార్జున, ఎమ్మెల్యే పీఏ వీరయ్య, నాయకులు వెంకటేష్, మంజుల, నవీన్, లింగప్ప, గంగాధర్ పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు

మడకశిర టౌన్, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో దోమలను నియంత్రించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు నగర పంచాయతీ చైర్మన్ నరసింహరాజు తెలిపారు. గురువారం ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛతాసేవ కార్యక్రమంలో భాగంగా డే ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వినియోగం తదితర ప్రక్రియలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణ వాసులు దోమల కాటుకు గురికాకుండా తుగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డే ఫాగింగ్ రహదారులు, కల్వర్టుల కింద చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ జగన్నాథ్, కౌన్సిలర్లు ఉమాశంకర్ పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి

గుడిబండ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామాల్లో పనిచేస్తున్న వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీధర్‌కు వినతి పత్రం ఇచ్చారు. గురువారం వీఆర్‌ఏల రాష్ట్ర సంఘం పిలుపు మేరకు తమ సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గోవిందప్ప, లింగప్ప, మంజునాథ్, మహంతేష్ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం

పెనుకొండ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. గురువారం ఎన్ఎస్ఎస్ పీఓ ప్రతాప్ ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. చెట్లకు పాదులుచేసి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. వర్షాకాలంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని రోగాలు రాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ హరీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థులకు డైరీల పంపిణీ

గోరంట్ల, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజాపురం కేజీబీవీ పాఠశాలలోని 118 మంది బాలికలకు టీడీపీ నాయకులు స్కూల్ డైరీలను గురువారం అందించారు. మంత్రి సవిత ఎస్ఆర్ఆర్ చార్టుబుల్ ట్రస్టు ద్వారా 8, 9, 10 చదువుతున్న బాలికల కోసం డైరీలను సమకూర్చారు. టీడీపీ నాయకులు బాలక్రిష్ణచౌదరి, సోముశేఖర్ ఆధ్వర్యంలో డైరీలను అందించారు. కార్యక్రమంలో ఎస్ఓ శిరీషా, టీడీపీ నాయకులు నిమ్మల విద్యాధరణి, గోపాల్‌రెడ్డి, ఉత్తమరెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

అగళి, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జడ్పీటీసీ సభ్యుడు ఉమేష్ పేర్కొన్నారు. అగళి వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం రైతులకు కిసాన్ డ్రోన్స్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతి అని, వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నారని అన్నారు. అనంతరం కిసాన్ డ్రోన్స్ పంపిణీ చేశారు. ఏఓ నాగరాజు పాల్గొన్నారు.

రేపటి నిరసన ర్యాలీని విజయవంతం చేయండి

పెనుకొండ, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ పరిరక్షణ కోసం బహుజన చైతన్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 20న పట్టణంలో నిర్వహించే నిరసన ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని చైతన్యవేదిక అధ్యక్షుడు శివరామక్రిష్ణ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో ఆర్డీటీ పేద ప్రజల కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బాబు, రవి, రామాంజనేయులు, కొల్లప్ప, ఆంద్రోస్, నరసింహులు, కదిరప్ప, రాజశేఖర్, నరసింహులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు